

జేఈఈ ఫలితాల్లో..
ప్రభుత్వ కళాశాలల
వెనుకంజ
7



సిరిపురంలో చెక్‌డ్యాంకు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం

చివరి ఆయకట్టుకూ సాగు నీరందిస్తాం

- తక్కువ ఖర్చుతో అధిక ఆయకట్టుకు నీరిచ్చే ప్రాజెక్టులకు ప్రాధాన్యం
- మధిర పర్యటనలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- రూ.72.33కోట్లతో అభివృద్ధి పనులకు శంకస్థాపన

మధిరరూరల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): చిట్టచివరి ఆయకట్టుకు సాగునీరందించడమే లక్ష్యంగా ప్రణాళికబద్ధంగా చర్యలు చేపడుతున్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. మధిర మండలంలోని సిరిపురం, మహాదేవపురం, రాయపట్నం, అంబారుపేట గ్రామాల్లో ఆదివారం పర్యటించిన భట్టి రూ.72.33కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. సిరిపురంలో రూ.6కోట్ల 85లక్షలతో చెక్‌డ్యాంకు, రూ.5కోట్లతో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం, రూ.10కోట్ల 31లక్షలతో ఐటీఐ కళాశాల భవనం పనులకు శంకుస్థాపన చేశారు. మహదేవపురంలో రూ.12కోట్ల 14లక్షలతో ఎత్తిపోతల పథకం, రాయపట్నంలో ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేశారు. రూ.25కోట్లతో అంబారుపేట, మొలుగుమాడు ఆర్‌అండ్‌బీ రోడ్డు విస్తరణ పనులకు భట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో భట్టి విక్రమార్క మాట్లాడారు. గత ప్రభుత్వం భారీగా అప్పులు చేసి ప్రాజెక్టులపై ఖర్చుచేసినా కొత్త ఆయకట్టును సృష్టించడంలో విఫలమైందన్నారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తక్కువ ఖర్చుతో పనులు చేపట్టి అధిక ఆయకట్టును సాధించడమే లక్ష్యంగా ప్రాజెక్టులు చేపడుతున్నామన్నారు. ప్రజాప్రభుత్వం వ్యవసాయం, విద్య, వైద్యానికి పెద్దపీట వేయడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు (మిగతా 6వ పేజీలో)

మెప్మా గాడిన పడేనా?

- గతేడాది డీఎంసీకి రోడ్డు ప్రమాదం
- రెండు మునిసిపాలిటీలకే పరిమితమైన ఏడీఎంసీ
- ఏడాదిగా కుంటుపడిన లక్ష్యాలు

6



రాష్ట్రంలో ప్రముఖ జలాశయాల్లో ఒకటైన పాలేరు జలాశయానికి అనుసంధానంగా మత్స్యకళాశాల ఏర్పాటు కోసం ఔత్సాహిక విద్యార్థులు ఆశగా ఎదురు చూస్తున్నారు. పాలేరుకు మూడేళ్ల క్రితం మత్స్య కళాశాల మంజూరైనా నేటికీ కళాశాల ఏర్పాటుకు మోక్షం లభించడం లేదు. ప్రభుత్వం మారినా అధికారులు, పాలకులు మత్స్య కళాశాల ఏర్పాటులో మీనమేషాలు లెక్కిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కళాశాల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఎంపికచేసిన అధికారులు నిర్మాణానికి అవసరమైన భవనాలు, ఫర్నీచర్ ఇతరత్రా ఏర్పాట్లకు రూ.42కోట్లతో ప్రతిపాదనలు పంపారు. కానీ దీనిపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి కదలిలే లేదు. మరో మూడు నెలల్లో నూతన విద్యాసంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో మత్స్యకళాశాల ప్రతిపాదనలు ఈసారైనా కార్యరూపం దాల్చుతాయా లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అనువైన స్థలం, అవసరమైన వసతులు తాత్కాలికంగా అందుబాటులో ఉన్నా కళాశాల ప్రారంభ అంశాన్ని ఎవరూ పట్టించుకోకపోవడంతో ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నచందంగా తయారైంది. స్థానిక ఎమ్మెల్యే అయిన రాష్ట్ర కేబినెట్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కీలకంగా ఉన్నందున నిధులు మంజూరు చేయించాలని కోరుతున్నారు.



పాలేరు మత్స్యపరిశోధనాస్థానంలో శిక్షణలో ఔత్సాహికులు

- కళాశాల ప్రారంభంలో ఎడతెగని జాప్యం
- కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ లభించని మోక్షం
- జుజ్జులరావుపేట సమీపంలో 10ఎకరాల స్థలం గుర్తింపు
- రూ.42కోట్లతో ప్రతిపాదనలు పంపినా పట్టించుకోని సర్కార్
- మరో మూడు నెలల్లో నూతన విద్యాసంవత్సరం ప్రారంభం
- కళాశాల కోసం ఎదురుచూస్తున్న ఔత్సాహిక విద్యార్థులు

ఇంకా.. మీనమేషాలేనా?

మూడేళ్ల క్రితం పాలేరులో మత్స్య కళాశాల మంజూరు

కూసుమంచి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోనే మొట్టమొదటి మత్స్య పాలిటెక్నిక్ కళాశాల ఖమ్మం జిల్లాలో ఏర్పాటుచేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ఈ క్రమంలో పాలేరు మత్స్యపరిశోధనా కేంద్రం పరిధిలో 20 సీట్లతో కళాశాలను ప్రతిపాదిస్తూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2022 సెప్టెంబరులో ఉత్తర్వులు జారీ చేసింది. 10వ తరగతి అనంతరం పాలీసెట్ ద్వారా సీట్లను భర్తీచేస్తారు. ఇప్పటివరకు ఏపీలోని బావుదేవరపల్లిలో మాత్రమే మత్స్య కళాశాల ఉంది. ఇక్కడి విద్యార్థులు అక్కడ విద్యనభ్యసిస్తున్నారు. పాలేరుకు మత్స్యకళాశాల మంజూరు కావడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేసినా కళాశాల ప్రారంభం ఆలస్యమవుతుండడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

10ఎకరాల స్థలం కేటాయింపు

ఖమ్మం జిల్లాకు మత్స్య పాలిటెక్నిక్ కళాశాల మంజూరు కావడంతో ఉన్నతాధికారులు స్థల సేకరణ చేశారు. కూసుమంచి మండలం జుజ్జులరావుపేట గ్రామంలో 356 సర్వే నెంబరులో సుమారు 12 ఎకరాలు ఎన్నెస్పీ స్థలం ఉండగా కొంతకబ్జాకు గురవగా, మిగిలిన 10ఎకరాల భూమిని గుర్తించారు. ఉన్నతాధికారుల బృందం స్థలాన్ని పరిశీలించి, అనువుగా ఉండటంతో వెంటనే మత్స్యశాఖకు అప్పగించారు.

ఎక్కడవేసిన గొంగళి అక్కడే..

పాలేరు మత్స్య పాలిటెక్నిక్ కళాశాలకు స్థలాన్ని గుర్తించి మత్స్యశాఖకు కేటాయించినా కళాశాల ఏర్పాటు ఎక్కడ వేసిక గొంగళి అక్కడే అన్నచందంగా తయారైంది. భవనాల నిర్మాణం, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇతరత్రా సుమారు రూ.42కోట్ల అంచనాలతో ఫిషరీస్ అధికారులు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయానికి ప్రతిపాదనలు పంపించారు. ఈ విద్యాసంవత్సరమే క్లాసులు ప్రారంభించుకునేలా అవసరమైన వసతులు ఉన్నాయని నివేదించారు. ప్రతిపాదిత స్థలానికి దగ్గరలో కూసుమంచిలో రెవెన్యూ అకాడమీ, పాలేరులో మత్స్యపరిశోధనాకేంద్రంలో వసతులు ఉన్నాయిని నివేదించారు. కానీ ఇప్పటివరకు ఫైనాన్షియల్ క్లియరెన్స్ రాలేదని ఫిషరీస్ అధికారులు చెబుతున్నారు. దీంతో కళాశాల ఏర్పాటు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుంది. కళాశాల మంజూరు చేసి సుమారు రెండేళ్ల గడుస్తున్నా నేటివరకు ఏర్పాట్లు ముందుకుసాగకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పాలేరు ఎమ్మెల్యే, రెవెన్యూ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాష్ట్ర కేబినెట్‌లో కీలకంగానే ఉన్నందున ఈ కళాశాల ఏర్పాటుపై దృష్టిపెట్టి కళాశాల ప్రారంభానికి కృషి చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. వచ్చే 2024-25 విద్యాసంవత్సరం నుంచే కళాశాల ప్రారంభించాలని కోరుతున్నారు. ఇప్పటికైనా అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి వెంటనే కళాశాల ఏర్పాటు గురించి పట్టించుకోవాలని కోరుతున్నారు.



ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం

డాక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎఫ్ఆర్‌వో పాలేరు

పాలేరులో మత్స్య పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు కావాల్సిన ఆర్థిక వనరులపై రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. మత్స్య కళాశాలకు అవసరమయ్యే రెగ్యులర్ పోస్టులు, భవనాలు, ల్యాబ్‌లు, హాస్టల్, అకడమిక్ బిల్డింగ్స్ అవసరమయ్యే బడ్జెట్ తదితర అంశాలపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ఇటీవల రెవెన్యూశాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కూడా కలిసి నివేదించాం. ప్రభుత్వం నుంచి మంజూరు జీవో రావాల్సి ఉంది. జీవో రాగానే కళాశాల ఏర్పాటు పనులు చేపడతాం. వచ్చే విద్యాసంవత్సరం నుంచే క్లాసులు ప్రారంభం అయ్యేలా కృషి చేస్తున్నాం.



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

పంటలు కోల్పోతే పరామర్శించరా..

- జిల్లాలో ముగ్గురు మంత్రుల మధ్య ఆధిపత్య పోరు
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

6



భూ భారతి సదస్సును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

‘భూ భారతి’తో రైతులకు మేలు

- మనిషికి ఆధార్ కార్డులాగా.. భూమికి భూధార్ సంఖ్య
- ఖమ్మం అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

6



యువతికి వేధింపులు

- ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె పేరున తప్పుడు పోస్టులు
- కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో యువకుడిపై కేసు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): యువతిని వేధింపులకు గురి చేసిన ఓ యువకుడిపై కొత్తగూడెం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెం పట్టణానికి చెందిన ఓ యువతి సుజాతనగర్ మండలంలోని ఓ ప్రవేటు కళాశాలలో చదువుతోంది. ఈ క్రమంలో ఖమ్మం జిల్లా వైరా మండలం విప్పలమడుగు గ్రామానికి చెందిన బి.రాహుల్ ఆమెతో పరిచయం పెంచుకున్నాడు. తన అక్క క్లాస్‌మెట్ అయిన సదరు యువతితో రాహుల్ నిత్యం ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. ఈ నేపథ్యంలో సదరు యువతి రాహుల్ నుంచి కొంత డబ్బు అప్పుగా తీసుకొని కొంతకాలానికి తిరిగి ఇచ్చేసింది. అయితే తన వద్ద తీసుకున్న బాకీ పూర్తిగా తీర్చలేదని, దానికి బదులుగా తనతో శారీరకంగా దగ్గర కావాలని ఆ యువతిని రాహుల్ వేధింపులకు గురి చేస్తున్నాడు. ఆ వేధింపులు భరించలేక సదరు యువతి ఈ విషయాన్ని తన తల్లిదండ్రులకు తెలియజేసింది. దాంతో వైరా మండలంలోని కొంతమంది పెద్దమనుషుల సమక్షంలో గతంలో పంచాయతీ పెట్టి రాహుల్‌ను (మిగతా 6వ పేజీలో)

రామయ్యను దర్శించుకున్న డీజీ సీవీ ఆనంద్

- ఆలయంలో ప్రత్యేక పూజలు

6

ఉద్యోగుల సదస్సును విజయవంతం చేయండి

- టీజీఈజేఏసీ పిలుపు

6



మాట్లాడుతున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

వరంగల్ సభకు జనసమీకరణపై బీఆర్ఎస్ దృష్టి

- ఎమ్మెల్సీ తాతా మధు అధ్యక్షతన సన్నాహక సమావేశం
- హాజరైన ఎంపీ వద్దిరాజు, మాజీమంత్రులు పువ్వాడ, వనమా, మాజీ ఎమ్మెల్యేలు

ఖమ్మం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతిప్రతినిధి): వరంగల్‌లోని ఎల్కతుర్తిలో 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఉమ్మడి జిల్లానుంచి భారీ జనసమీకరణ చేపట్టాలని బీఆర్ఎస్ నేతలు నిర్ణయించారు. ఖమ్మంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఆదివారం పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అధ్యక్షతన ఉమ్మడి జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు, జిల్లానేతలు సమావేశమయ్యారు. ఈ సన్నాహక సమావేశానికి రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీమంత్రులు పువ్వాడ అజయ్‌కుమార్, వనమా వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, రేగా కాంతారావు, కందాళ ఉపేందర్‌రెడ్డి, కొండబాల కోటేశ్వరరావు, బానోత్ హరిప్రియ, మదన్‌లాల్, చంద్రావతి జడ్పీ మాజీ చైర్మన్ లింగల కమల్‌రాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వరంగల్ సభకు జనసమీకరణపై సమీక్షించారు. సభను విజయవంతం (మిగతా 6వ పేజీలో)



గోదావరి నీటిప్రవాహాలకు అడ్డు కట్టగా ఏర్పాటు చేసిన రోడ్డు

గోదారికి అడ్డుకట్ట!

- మణుగూరు వద్ద ఇసుక కోసం కాంట్రాక్టర్ల బరితెగింపు
- నది మధ్యలోకి లారీలు వెళ్లేలా గోదావరిలో అడ్డంగా రోడ్డు
- చోద్యం చూస్తున్న మైనింగ్ శాఖ అధికారులు
- వేసవిలో దిగువ ప్రాంతాలకు చేరని నదీ జలాలు

మణుగూరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మణుగూరు మునిసిపాలిటీ పరిధిలో పద్మగూడెం ఇసుక ర్యాంపు నిర్వాహకులు బరితెగించి గోదావరికే అడ్డుకట్ట వేసి ఇసుక రవాణా చేస్తున్నారు. నడి గోదావరిలో ఎక్స్‌కవేటర్లతో ఇసుక తోలకాలు చేయడమే ఒక అక్రమమైతే నిండి వేసవిలో గోదావరి ప్రవాహాలకు అడ్డుకట్ట వేసి లారీలకు మార్గాన్ని ఏర్పాటు చేసి ఇసుక దందా సాగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. మణుగూరులోని పద్మగూడెం ఇసుక ర్యాంపు నిర్వహణలో మూడు గ్రామాల మధ్య వివాదాలు తలెత్తి గ్రామాల్లో స్నేహపూర్వక వాతావరణాన్ని కలుషితం చేశాయి. మూడు నెలలుగా ఈ వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. గిరిజన సొసైటీలో సభ్యులను కొందరు కాంట్రాక్టర్లు మచ్చిక చేసుకుని ఇష్టారాజ్యంగా వ్యహరిస్తున్నట్లు సమాచారం. కీలక కమిటీలో సభ్యుల తొలగింపులు, మార్పులు చేర్పులు అన్నీ వారి కనుసన్నల్లోనే జరగటంతో ఈ వివాదాలు ఆరంభమైయ్యాయి. సొసైటీ కింద సుమారు 140 మందికి పైగా మూడు గ్రామాల ప్రజలు ఉన్నట్లు సమాచారం. లోడ్ చేసిన లారీలపై ఇసుక హెచ్చుతగ్గులను సరిచేస్తూ ఉపాధి పొందేందుకు మాత్రమే ఈ సోసైటీ పనిచేస్తోంది. అయితే ఈ ఉపాధి పనులపై సొసైటీ కమిటీలో నెలకొన్న విభేదాలు ఓ కొలిక్కి వచ్చే పరిస్థితులు కనిపించడం లేదు. శుక్రవారం ర్యాంపు వద్ద రెండు గ్రామాలకు చెందిన ప్రజలు మధ్య తోపులాట కూడా జరిగి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పలువురికి స్వల్ప గాయాలు కూడా అయ్యాయి. కమిటీ ఏర్పాటులో నెలకొన్న విభేదాలపై గతంలో పలుసార్లు పద్మగూడెం, కొమ్ముగూడెం, కొండాపురం గ్రామాలకు చెందిన వీరంతా పోలీసుస్టేషన్‌ను చేరుకుని పరస్పర ఫిర్యాదులు కూడా చేసుకున్నారు.

ఇదిలా ఉంటే అసలు నడి గోదావరిలో ఇసుక మైనింగ్‌కు అధికారులు ఎలా అనుమతులు ఇచ్చారు. భారీ ఎక్స్‌కవేటర్లతో ఇసుకను లారీలకు ఎలా లోడ్ చేస్తున్నారన్న విషయాన్ని మైనింగ్ అధికారులే తేల్చాల్సి ఉంది. నడి వేసవిలో గోదావరి ప్రవాహాలకు అడ్డుకట్ట వేయడం వల్ల దిగువ ప్రాంతాలకు నీరు వెళ్లడం లేదు. దిగువన పలు పరిశ్రమలతో పాటు అనేక గ్రామాల తాగునీటి అవసరాలను తీర్చే గోదావరి జిల్లాలను ఇసుక కోసం బంధించడంపై ప్రజలనుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఎండాకాలంలో గోదావరి జలాలే దిగువ ప్రాంతాలకు ఆసరా కాకగా అలాంటి నీటిని కట్టలు వేసి అడ్డుకోవడంతో దిగువ ప్రాంతాల ప్రజలకు తీవ్రస్థాయిలో తాగునీటి సమస్య ఎదురయ్యే ప్రమాదం పొంచి ఉంది. ఈ వ్యవహారంలో మైనింగ్ అధికారుల తీరుపై తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా కలెక్టర్ ఈ విషయంపై దృష్టి సారించి గోదావరికి అడ్డుకట్ట వేసినవారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



నిలిచిపోయిన గోదావరి జలాలు



కుటుంబసభ్యులతో డీజీ సీవీ ఆనంద్

రామయ్యను దర్శించుకున్న డీజీ సీవీ ఆనంద్

భద్రాచలం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి వారిని ఆదివారం హైదరాబాద్ సీటీ పోలీస్ కమిషనర్, డీజీ సీవీ ఆనంద్ కుటుంబసభ్యులతో దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు ఆయనకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలుకగా ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం చేశారు. ఈ సమయంలో డీజీ సీవీ ఆనంద్‌కు శాలువా స్వామివారి ప్రసాదం, జ్ఞాపికను అందజేశారు. కాగా రామాలయ సందర్శన సమయంలో ఆలయ ప్రశస్యాన్ని వైదిక సిబ్బంది డీజీకి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట భద్రాచలం ఏఎస్పీ విక్రాంతికుమార్ సింగ్, దేవస్థానం ఏఈవో శ్రావణ్‌కుమార్, ప్రధాన అర్చకులు కోటిరామ స్వరూప్ రాఘవాచార్య, రామాయణ పారాయణ దారులు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు, వేద పండితులు మల్లూరు రవికుమార్ శర్మ పాల్గొన్నారు. ఆదివారం పురస్కరించుకుని మూలవరులకు పంచామృతాభిషేకం, సువర్ణ పుష్పార్చన, నిత్య కల్యాణం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

ఇతర రాష్ట్రాల ధాన్యాన్ని ఖమ్మం జిల్లాకు రానివ్వద్దు

» అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి



చెక్‌పోస్టు సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

ముదిగొండ/తల్లాడ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఇతర రాష్ట్రాల్లోని ధాన్యాన్ని జిల్లాలోకి రానివ్వకుండా పకడ్బందీగా విధులు నిర్వర్తించాలని ఖమ్మంజిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. ఆదివారం ముదిగొండ మండలం వల్లభి వద్ద ఏర్పాటుచేసిన అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టును ఆయన తనిఖీ చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం లోడ్ లారీలు ఏమైనా వస్తున్నాయా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోకి రానివ్వకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తల్లాడలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ముదిగొండ మండలం న్యాలక్ష్మీపురం కేజీబీవీ పాఠశాలను పరిశీలించి విద్యార్థినులతో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో తిరుగుతూ తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు.

మెప్మా గాడిన పడేనా?



అన్ని రంగాల్లో రాష్ట్రంలోనే తనకంటూ ప్రత్యేకతను చాటుతూ అభివృద్ధిలో ముందున్న ఖమ్మం జిల్లా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా)లో మాత్రం వెనుకబాటుకు గురవుతోంది. తఒక వైపు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడి తమ నియోజకవర్గాల్లోని ప్రాంతాలను కలుపుతూ నూతన మునిసిపాలిటీలను ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వినూత్న కార్యక్రమాలతో మహిళా సంఘాలు ముందకు వెళ్తున్నాయి. ఖమ్మం జిల్లాలో మాత్రం జిల్లా అధికారులు జిల్లా వ్యాప్తంగా ఉన్న మునిసిపాలిటీలపై నిత్య పర్యటనలు తగ్గటంతో గతేడాది నుంచి మెప్మా అభివృద్ధి కుంటుపడింది. నూతన సంఘాల ఏర్పాటు నుంచి రాజీవ్ యువ వికాసం వంటి ప్రతిష్టాత్మక కార్యక్రమాల లక్ష్యాలు దెబ్బతింటున్నాయని విమర్శలు వెలువడుతున్నాయి.

» గతేడాది డీఎంసీకి రోడ్డు ప్రమాదం
» రెండు మునిసిపాలిటీలకే పరిమితమైన అదనపు డీఎంసీ
» ఏడాదిగా కుంటుపడిన లక్ష్యాలు
» నూతన మహిళా సంఘాల ఏర్పాటులో 39శాతం లక్ష్యం పూర్తి
» అన్ని మునిసిపాలిటీలకు బాధ్యతలు కేటాయిస్తాం: డీఎంసీ సుజాత



సమావేశమైన మహిళా సంఘం సభ్యులు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య బాధ్యతలు తీసుకోవటంతో తొలిసారిగా మెప్మా పీడీగా ఐఏఎస్ అధికారి తన మార్కును చూపబోతున్నారు. శనివారం సమావేశం నిర్వహించిన ఆయన వినూత్న కార్యక్రమాలపై మార్గదర్శకం చేశారు. మెప్మా జిల్లా స్థాయి అధికారులను అన్ని మునిసిపాలిటీలకు పర్యవేక్షణకు పంపటం ద్వారా మధిర, సత్తుపల్లి, వైరా, కల్లూరు, ఏదులాపురం మునిసిపాలిటీలు లక్ష్యాల చేరేందుకు కృషి చేయాల్సిన అవసరం కనిపిస్తోంది.

డీఎంసీకి రోడ్డు ప్రమాదంతో..

ఖమ్మం జిల్లా మెప్మా జిల్లా మిషన్ కోఆర్డినేటర్‌గా సావల సుజాత పనిచేస్తున్నారు. గత సంవత్సరం ఓ రోడ్డు ప్రమాదంలో ఆమె కాలుకు గాయమైంది. దీంతో డీఎంసీ ఖమ్మం నగరం మినహా మధిర, వైరా, సత్తుపల్లి, కల్లూరు, ఏదులాపురం మునిసిపాలిటీల పర్యటనకు వెళ్లటం కష్టంగా మారింది. అయితే కాలుకు ఉన్న గాయానికి వైద్య చికిత్సల కోసం వారం రోజులు సెలవు పెట్టారు.

రెండు మునిసిపాలిటీలకే పరిమితం..

మెప్మాలో డీఎంసీ తర్వాత జిల్లా స్థాయిలో అదనపు డీఎంసీ బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుంది. కానీ గత ఐదేళ్లగా అదనపు డీఎంసీ బండారుపల్లి వెంకటేశ్వర్లు ఖమ్మం నగర పాలక సంస్థతో పాటుగా వైరా మునిసిపాలిటీలకు మాత్రమే పరిమితమైనారు. ఎంతో కీలకమైన

2025 నూతన సంఘాల లక్ష్యాలు

మునిసిపాలిటీ	లక్ష్యం	పూర్తి	శాతం
ఖమ్మం నగరపాలక సంస్థ	800	301	37.63
మధిర	46	23	50.00
సత్తుపల్లి	36	23	63.89
వైరా	60	21	35.00

మధిర, సత్తుపల్లి మునిసిపాలిటీలపై ఐదేళ్లలో కన్నెత్తి చూడలేదని విమర్శలు వెలువడుతున్నాయి. ఖమ్మంలో కమ్యూనిటీ ఆర్గనైజర్‌గా పనిచేస్తున్న గోపోజు ఉపేంద్రమ్మ ఐదేళ్లుగా మధిర మునిసిపాలిటీ టీఎంసీగా అన్ని బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దీంతో ఖమ్మంలో సంఘాల పర్యవేక్షణపై ప్రభావం పడింది. ఖమ్మంలో టీఎంసీగా పనిచేస్తున్న గుడిపూడి సుజాతరాణి సత్తుపల్లి మునిసిపాలిటీలో అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆ ప్రభావం కూడా ఖమ్మం నగరంలోని మెప్మాపై పడుతుంది. సత్తుపల్లిలో పనిచేస్తున్న సీవోలు కల్లూరు మునిసిపాలిటీ అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నూతనంగా ఏర్పాడిన ఏదులాపురంలో ఖమ్మం సీవో సయ్యద్ సల్మాకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఖమ్మం మెప్మాలోని మహిళా సీవోలు, టీఎంసీలు సుదూర ప్రాంతాల మునిసిపాలిటీలకు వెళ్లి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న పురుష అధికారైన ఏడీఎంసీ బండారుపల్లి వెంకటేశ్వర్లు మాత్రం ఉద్యోగ జాబ్‌చార్టు మేరకు అదనపు డీఎంసీ హోదాలో అన్ని మునిపాలిటీలకు పర్యవేక్షణకు వెళ్లడం లేదు.

39శాతానికి పరిమితమైన నూతన సంఘాల లక్ష్యం

రాష్ట్ర ప్రభుత్వం మహిళా స్వయం సహాయక సంఘాలకు అధిక ప్రాధాన్యం కల్పిస్తోంది. పెట్రోల్ బంకుల నిర్వహణ నుంచి ఫుడ్ పార్కుల నిర్వాహణ వరకు అన్ని రంగాల్లో మహిళాలకు అవకాశాలు కల్పించి మహిళా సాధికారితకు కృషి చేస్తోంది. కానీ ఖమ్మం జిల్లాలో మాత్రం ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు మినహా మరో పథకం అమలు కావటం లేదు. నూతన సంఘాల ఏర్పాటు లక్ష్యాల్లోను కేవలం 39శాతానికి ఖమ్మం జిల్లా పరిమితమైంది.

కాగా ఈ విషయంపై డీఎంసీ సావల సుజాతను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా అదనపు డీఎంసీ బండారుపల్లి వెంకటేశ్వర్లుకు జిల్లా వ్యాప్తంగా అన్ని మునిసిపాలిటీల పర్యవేక్షణకు పంపుతామన్నారు. నూతనంగా మునిసిపాలిటీలు ఏర్పడినా ఆ మేకు పోస్టులు మంజూరు కావటం లేదని, ఖమ్మంలో ఉన్న సీవోలను ఇతర మునిసిపాలిటీలకు పంపుతున్నామన్నారు.

ఘనంగా చంద్రబాబు పుట్టిన రోజు వేడుకలు



టీడీపీ కార్యాలయంలో కేక్‌ను కట్ చేస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పుట్టినరోజును ఆదివారం టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. టీడీపీ కార్యాలయం ఎన్టీఆర్ భవనంలో కేతినేని హరీష్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. తొలుత కార్యాలయంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి భారీ కేక్ కట్ చేశారు. బాణసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ చంద్రబాబు తన కలల రాజధాని అమరావతి నిర్మించాలని, పోలవరం డ్యాం పూర్తి చేయాలని ఆకాంక్షించారు, ఆ తర్వాత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు విజయలక్ష్మి, నందమూరి త్రిపురదేవి, పావని, మీగడ రామారావు, ఒర్సు రాటకొండ, అశోక్, నాగండ్ల లక్ష్మణ్, కొలికొండ మురళి, కన్నేటి పృథ్వీ, కామిని నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉద్యోగుల సదస్సును విజయవంతం చేయండి

» టీజీఈజేఏసీ పిలుపు

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఈనెల 25న నిర్వహించనున్న ఉద్యోగుల సదస్సును విజయవంతం చేయాలని టీజీఈజేఏసీ నాయకుడు గుంటుపల్లి శ్రీనివాసరావు కోరారు. ఆదివారం ఖమ్మం జిల్లా తెలంగాణ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఏప్రిల్ 25న సాయంత్రం 4:30 గంటలకు టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్లో ఖమ్మం జిల్లా టీజీజేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగుల సదస్సు నిర్వహిస్తున్నట్లు ఈ సదస్సుకు రాష్ట్ర కమిటీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావుతో పాటు రాష్ట్ర కార్యవర్గ నాయకులు పాల్గొంటారని తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, గెజిటెడ్ ఆఫీసర్లు, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం టీజీఈజేఏసీతో సమావేశాన్ని ఏర్పాటు చేసి సమస్యలపై చర్చించి ఆమోద యోగ్యమైన నిర్ణయాలు తీసుకోవాలని రాష్ట్ర టీజీఈజేఏసీ సెక్రటరీ ఏలూరి శ్రీనివాసరావు కోరారు.

జిల్లాలో భారీ వర్షం



ఈదురుగాలులకు కూలిన ఈస్టర్ కంటాట వేదిక

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం రాత్రి భారీగా ఈదుర గాలులతో వర్షం కురిసింది. జిల్లాలోని కొత్తగూడెం, అశ్వారావుపేట, పినపాక, ఇల్లెందు, భద్రాచలం నియోజకవర్గాలలోని అన్ని మండలాలలో వర్షం కురిసింది. ఈ వర్షానికి విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. కొత్తగూడెంలో భారీగా ఈదురు గాలులు వీయడంతో కొత్తగూడెం ప్రకాశం మైదానంలో నిర్వహించిన ఈస్టర్ కంటాట వేదిక కూలిపోయింది. దీంతో సభా వేదికపై ఉన్న కళాకారులు ఆందోళనకు గురయ్యారు.

సోనియా, రాహుల్‌పై కక్ష సాధింపు రాజకీయాలు

» జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు దేవీ ప్రసన్న



ఆందోళన చేస్తున్న మహిళా కాంగ్రెస్ నాయకులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై కక్ష పూ రిత రాజకీయం ఖండిస్తున్నామనిమహిళ భద్రాద్రి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు దేవి ప్రసన్న అన్నారు. ఆదివారం జిల్లా మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. మాట్లాడుతూ నేషనల్ హెరాల్డ్ కేసు విషంలో ఏఐసీసీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్‌గాంధీలపై బీజేపీ కక్షపూరిత రాజకీయా వేధింపులలో భాగంగా వారి పేర్లను చార్జిసీట్‌లో చేర్చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. లోపల వణుకు పుట్టి పైకి మాత్రమే గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్న బీజేపీ నాయకులని మండిపడ్డారు. మోడీ సర్కార్ రాహుల్ గాంధీని చూసి భయ పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ బండ్ల రజిని, ప్రధాన కార్యదర్శి పొదిలి జ్యోతి, కార్యదర్శి పందాల సరిత, బోడ దివ్య, నాయకురాలు బర్ల నాగమణి, బూరుగుపల్లి పద్మశ్రీ, సున్నం లక్ష్మీ, కమలమ్మ, కూరపాటి సౌజన్య, భూక్యా సుగుణ, స్వరూప, గుర్రం జయసుధ, మచ్చల పార్వతి, బడుగు కృష్ణవేణి, ప్రియాంక, గుర్రం సుశీల, రాజేశ్వరీ, విద్య, విజయలక్ష్మీ, శ్రీదేవి, పాల్గొన్నారు.

'భూ భారతి'ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

రాయగూడెం అవగాహన సదస్సులో ఖమ్మం అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

నేలకొండపల్లి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): రైతుల అవగాహన కోసం నిర్వహిస్తున్న భూభారతి చట్టం-2025 అవగాహన సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, ఈ చట్టంతో మేలు కలుగుతుందని ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి కోరారు. ఆదివారం రాయగూడెం గ్రామంలో జరిగిన భూభారతి అవగాహన సదస్సును అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తెచ్చిందన్నారు. చట్టాన్ని తొలుత రాష్ట్రంలోని నాలుగు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తోందని, అందులో నేలకొండపల్లి మండలం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ధరణి స్థానంలో కొత్తగా తెచ్చిన భూభారతి-2025 చట్టం ఎన్నో రకాలుగా రైతులకు ఉపయోగంగా ఉందన్నారు. గతంలో 'ధరణి' పోర్టల్‌లో ఏ పొరపాటు జరిగినా సివిల్ కోర్టుకు వెళ్లడం తప్ప మరో మార్గం ఉండేది కాదని, కానీ కొత్త భూభారతి చట్టంలో అప్పీల్‌కు అవకాశం ఉందన్నారు. సమస్యపై ఆర్డీవో వద్ద అప్పీల్ చేసుకోవచ్చని, ఆర్డీఓ నిర్ణయంపై అసంతృప్తి ఉంటే కలెక్టర్ వద్ద, అక్కడా న్యాయం జరుగలేదనుకుంటే ట్రిబ్యునల్‌లో అప్పీల్ చేసుకునే అవకాశాన్ని 'భూభారతి'లో ప్రభుత్వం కల్పించిందన్నారు. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందులకు ప్రతి గ్రామంలో గ్రామ పరిపాలనా అధికారులను నియమించేందులకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందన్నారు. మనిషికి ఆధార్ కార్డులాగా, భూమికి భూధార్ సంఖ్యను కేటాయించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు.

పెండింగ్‌లో ఉన్న సాదాబైనామాల పరిష్కారం కోసం సైతం భూభారతి చట్టంలో ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. పీఓటీ, ఎల్‌టీఆర్, సీలింగ్ చట్టాల ఉల్లంఘనలు లేని దరఖాస్తులను క్రమబద్ధీకరణ చేసి, నాటి స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు, రూ.100 అపరాధ రుసుం వసూలు చేసి సర్టిఫికెట్ జారీ చేస్తారని అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

భూ భారతి చట్టం రైతులకు అన్ని విధాలా ఉపయోగపడుతుందన్నారు. రాయగూడెంలో వివిధ సమస్యలకు సంబంధించి 64 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. బోదులబండలో నిర్వహించిన సదస్సులో 103 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

కార్యక్రమంలో నియోజకవర్గ నోడల్ అధికారిణి రాజేశ్వరి, తహసీల్దార్లు ఓరుగంటి వెంకటేశ్వర్లు, తఫజ్జుల్ హుస్సేన్, నాయబ్ తహసీల్దార్ సయ్యద్ ఇమ్రాన్, ఆర్ఐలు ఆలస్యం మధుసూధనరావు, అల్లం రవికుమార్, బోదులబండ సొసైటీ అధ్యక్షుడు అనంతు కాశయ్య, తీగ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతులు పంటలు కోల్పోతే పరామర్శించరా..?

బీఆర్ఎస్ మహిళా నేత, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

ఖమ్మం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఖమ్మం జిల్లాలో అకాలవర్షాలతో పంటలు దెబ్బతింటే జిల్లాలోని ముగ్గురు మంత్రులు కనీసం ఆ పంటలను పరిశీలించలేదని, బాధిత రైతులను పరామర్శించలేదని బీఆర్ఎస్ మహిళా నేత, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. జిల్లాలో ముగ్గురు మంత్రుల మధ్య ఆధిపత్యపోరు తప్ప ప్రజాసమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు జనం జాతరలా కదలిరావాలని విజ్ఞప్తి చేశారు. ఖమ్మంజిల్లాలో రెండు రోజుల పర్యటన కోసం ఆదివారం సాయంత్రం ఖమ్మం వచ్చిన కవితకు రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. అనంతరం రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కవిత మాట్లాడుతూ ఖమ్మం జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వర్షాలకు పంటలు దెబ్బతిని రైతులు ఇబ్బందుల్లో ఉంటే వారిని కనీసం ఓదార్చేవారు లేరన్నారు. పంట నష్టంపై రెవెన్యూ అధికారులతో సమీక్ష కూడా పెట్టలేదన్నారు. మంత్రులకు రైతులతో మాట్లాడే తీరిక కూడా లేదన్నారు. డిప్యూటీ సీఎం ఖమ్మం జిల్లా నుంచే ఉన్నా ఆయన ఇప్పటి వరకు రైతులను పలకరించలేదన్నారు. పంట నష్టపోయిన రైతులందరికీ ఎకరానికి రూ.20వేలు పరిహారం అందించాలన్నారు. ఖమ్మం జిల్లాలోని ముగ్గురు మంత్రుల మధ్య ఆధిపత్యపోరే తప్ప ప్రజల సమస్యలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు.

ఖమ్మం జిల్లా తమ అడ్డా అని చెప్పుకునే కమ్యూనిస్టు పార్టీలు ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయడంలేదన్నారు. వారు ప్రజల పక్షాన ఉండి ప్రశ్నించకపోవడంతో కమ్యూనిస్టు పార్టీలపై ప్రజల్లో నమ్మకం పోతోందన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని కమ్యూనిస్టుపార్టీ పెద్దలే కాంగ్రెస్ ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్నారని, అందుకే ప్రశ్నించడలేదన్న అనుమానాలున్నాయన్నారు.



కవితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీలు, నాయకులు

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ హయాంలోనే భక్తరామదాసు ప్రాజెక్టు పూర్తిచేసి సాగునీరు అందించామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఒక్క పథకం కూడా పూర్తి చేయలేదన్నారు. ములుగు జిల్లాలో చనిపోయిన శిశువుతో రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఎదుట నిరసన తెలపడం అక్కడి ఆసుపత్రిలో ఉన్న అధ్వాన్న పరిస్థితిని తెలియజేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తిరోగమన దిశలో పయనిస్తోందన్నారు. ప్రతిపక్ష పార్టీగా బీఆర్ఎస్ ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తోందన్నారు. ప్రజలు కూడా బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వాలని సూచించారు. వరంగల్‌లో జరిగే 25వసంతాల బీఆర్ఎస్ పండుగకు ఖమ్మంజిల్లా నుంచి ప్రజలు భారీ సంఖ్యలో తరలిరావాలని సూచించారు. సమావేశంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యేలు కొండబాల కోటేశ్వరరావు, బానోతు మదన్‌లాల్, బానోతు చంద్రావతి, హరిప్రియ పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకూ సాగు నీరందిస్తాం

(5వ పేజీ తరువాయి)

భారీగా నిధులు వెచ్చిస్తోందన్నారు. రాష్ట్రంలో ఆదర్శవంతమైన నియోజకవర్గంగా మధిరను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు తెలిపారు. మహదేవపురం పథకం ద్వారా 16.40 క్యూసెక్కుల నీటిని వైరా నది నుంచి ఎత్తిపోయడంతో 952 ఎకరాల వ్యవసాయ భూములు సస్యశ్యామలం కానున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఖమ్మం అదనపు కలెక్టర్ శ్రీజ, నీటిపారుదల సీఈ రమేష్‌బాబు, ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రీనివాసాచారి, ఆర్అండ్‌బీ ఎస్ఈ యుగంధర్, ఇరిగేషన్ ఎస్ఈ వాసంతి, ఆర్డీవో నరసింహారావు, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ రాంబాబు, ఇరిగేషన్ డీఈ నాగబ్రహ్మం, పీఆర్ డీఈ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

యువతికి వేధింపులు

(5వ పేజీ తరువాయి)

హెచ్చరించి, ఇలాంటి తప్పు మళ్లీ చేయవద్దని మందలించారు. అయినా తీరు మారని రాహుల్ మళ్లీ కొన్ని రోజుల తరువాత యువతి పేరుతో సోషల్ మీడియా వేదికగా రెచ్చిపోయాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె పేరుతో అకౌంటును క్రియేట్ చేసి ఆమె బంధువులు, స్నేహితులను ఆ అకౌంట్ నుంచి ఫాలో అవుతూ తప్పుడు పోస్టులను పెడుతున్నాడని యువతి తల్లిదండ్రులు ఆరోపించారు. ఇక రాహుల్ వేధింపులు తాళలేక యువతి ఆదివారం కొత్తగూడెం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించింది. బాధిత యువతి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరంగల్ సభకు జన సమీకరణపై బీఆర్ఎస్ దృష్టి

(5వ పేజీ తరువాయి)

చేయడమే లక్ష్యంగా జనసమీకరణ చేపట్టాలని, సభకు అవసరమైన వాహనాలు, భోజనం తాగునీటి ఏర్పాట్లుపై చర్చించారు. నియోజకవర్గాల వారిగా ఇన్‌చార్జ్‌లను నియమించారు. బహిరంగ సభకు వెళ్లే రూట్‌మ్యాప్, పార్కింగ్ వివరాలపై చర్చించారు. 25వ తేదీన అన్ని మండల కేంద్రాల్లో పార్టీ జెండావిష్కరణలు చేయాలని, గ్రామాల్లో గద్దెలను ముస్తాబుచేసి 27న ఉదయం జెండా విష్కరణల అనంతరం సభకు వాహనాల్లో తరలాలని నిర్ణయించారు. సమావేశంలో భద్రాచల నియోజకవర్గ ఇన్‌చార్జ్ రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణ, ఉప్పల వెంకటరమణ, దిండిగాలరాజేందర్, పగడాల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

బీటీపీఎస్ ఉద్యోగికి తీవ్రగాయాలు

అశ్వాపురం ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గొల్లగూడెం న మీపంలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మణుగూరు బీటీపీఎస్ ఉద్యోగి తీవ్ర గాయాలపాలయ్యాడు. సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. బీటీపీఎస్‌లో ఏడీఈగా పనిచేస్తున్న రమణ కు టుంబ సభ్యులతో కారులో విజయవాడవెళ్లి తిరిగి వస్తుండగా తెల్లవారు జామునగొల్లగూడెం వద్ద వారు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి కల్వర్టును ఢీకొట్టి రహదారిపై పల్టీ కొట్టింది. ఈ సంఘటనలో రమణ చేయివిరగటం తోపాటు గాయాలు కాగా, కుటుంబ సభ్యులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. తీవ్రగాయాలపాలైన రమణను చికిత్స నిమిత్తం విజయవాడలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు.

బోర్ బండిని సీజ్ చేసిన.. అటవీ అధికారులు

జూలూరుపాడు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుం డా అటవీ ప్రాంతంలో ఓ రైతు బోర్ వేస్తుండటంతో అటవీ శాఖ అధికారు లు పట్టుకుని ఆదివారం తెల్లవారుజామున సీజ్ చేశారు. పాపకొల్లు అటవీ సెక్షన్ అధికారి మల్లయ్య తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. పాపకొల్లు-బి అటవీ ప్రాంత పరిధిలో అదే గ్రామానికి చెందిన డి.సేవు అనే రైతు ఆర్‌ఓఎఫ్ఆర్ పట్టా కలిగివున్నప్పటికి తన భూమిలో బోర్ వేసుకోవటానికి ఐటీడీ ఏ ద్వారా అనుమతి పత్రం పొందలేదు. అనుమతులు లేకుండానే సదరు రైతు తన భూమిలో బోర్ వేస్తుండటంతో నమ్మదగిన సమాచారం మేరకు ఎఫ్‌బీవో విజయలక్ష్మీతో కలసి సంఘటన స్థలానికి వెళ్లి బోర్ బండిని పట్టుకు ని సీజ్ చేసి జూలూరుపాడులోని అటవీ శాఖ నర్సరీకి తరలించారు.

వైరా నడిబొడ్డున ఎన్నాళ్లీ శిథిలాలు..?

- నిరుపయోగంగా ఉన్న రూ.వందకోట్ల ప్రభుత్వ స్థలాలు
- నాలుగేళ్ల కిందట అక్రమ నిర్మాణాల కూల్చివేత
- షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి కోర్టు స్టేతో అడ్డంకులు
- స్టే ఎత్తివేయించడంలో అధికారుల్లో కొరవడిన చిత్తశుద్ధి

వైరా, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ, మండల, మునిసిపల్ కేంద్రమైన వైరాలోని ప్రధాన రహదారి పక్కన నాలుగు సంవత్సరాలుగా రూ.వందకోట్ల విలువైన ప్రభుత్వ స్థలాలు శిథిలాల దిబ్బగా దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లిప్తతో ఆయా స్థలాలకు ఈ పరిస్థితి దాపురించింది. వైరాలోని జాతీయ ప్రధాన రహదారి పక్కన అలాగే మధిర-జగ్గయ్యపేట ఆర్అండ్బీ రహదారి పక్కన ఆర్అండ్బీ, నీటిపారుదలశాఖ, క్రీడాశాఖకు చెందిన స్థలాలను ఆక్రమించి కొన్ని దశాబ్ధాల తరబడి పలువురు వ్యాపార సముదాయాలను కొనసాగిస్తున్నారు. అయితే 2021 డిసెంబరులో అప్పటి జిల్లా కలెక్టర్ వీపీ.గౌతమ్ ఆదేశాలతో యుద్ధప్రాతిపదికన స్థానిక రెవెన్యూ, పోలీసు, మునిసిపల్శాఖల అధికారులు దాదాపు 50అక్రమ దుకాణాలను కూల్చివేశారు. ఇంకా 19 మంది హైకోర్టు స్టేతో ఈ స్థలాల్లో తిష్ట వేసి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. రెవెన్యూ, మునిసిపల్శాఖల అధికారులు ముందుగా హైకోర్టు స్టేలో పరిష్కారానికి చొరవ చూపకుండా అనాలోచిత చర్యలు చేపట్టారనే విమర్శలు కూడా ఉన్నాయి. ముందుగా హైకోర్టులో స్టేను తొలగింపజేసి ఆతర్వాత ఏకమొత్తంగా ఈ ఆక్రమణలు తొలగించినట్లయితే నేడు వైరాలో ప్రధాన రహదారుల వెంట శిథిలాల దిబ్బలు దర్శనమిచ్చేవి కావని స్థానికులు విమర్శిస్తున్నారు. పైన పేర్కొన్న ప్రభుత్వశాఖలకు చెందిన స్థలాల్లో సోమవరం రెవెన్యూ సర్వేనెంబర్ 98లో 0.06ఎకరాలు, బ్రాహ్మణపల్లి అగ్రహారం రెవెన్యూ సర్వేనెంబర్ 03లో 0.36ఎకరాలు మొత్తం 1.02ఎకరాల్లోని స్థలాలను ఆక్రమించి కొన్ని దశాబ్ధాల తరబడి 69మంది హోటళ్లు, ఫొటో స్టూడియోలు, మెకానిక్ షెడ్లు, పండ్ల కొట్లు, పలురకాల వ్యాపార సముదాయాలను నిర్వహిస్తున్నారు. వీరిలో కొద్దిమంది మినహా మిగిలిన వారికి స్థిరచర ఆస్తులు పుష్కలంగా ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో 59 జీవో కింద భూముల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తులు చేసుకోగా రెవెన్యూ అధికారులు ఆ దరఖాస్తులను తిరస్కరించారు. అయితే అప్పటి కలెక్టర్ గౌతమ్ ఆదేశాలతో ఎలాంటి కోర్టు వివాదాలు లేని 50మంది దుకాణాలను నేలమట్టం చేశారు. అయితే మిగిలిన 19మంది హైకోర్టు నుంచి స్టే పొంది ఉండటంతో వాటి జోలికి వెళ్లలేదు.

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని భావించినా...

అక్రమ దుకాణాలను తొలగించి మునిసిపాలిటీ ఆధ్వర్యంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని నాటి కలెక్టర్ తలపెట్టిన కార్యం ముందుకు వెళ్లలేదు. అప్పటి ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ను దుకాణాలు కోల్పోయినవారు కలిసి తాము డిపాజిట్లు చెల్లిస్తామని, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి తాము వాటిలో వ్యాపారాలు నిర్వహించుకొనేందుకుగానూ లీజుకు ఇచ్చేలా హామీ ఇవ్వాలని కోరారు. దాంతో నాటి ఎమ్మెల్యే ఇదే విషయమై కలెక్టర్ వద్దకు వెళ్లి వ్యాపారుల ప్రతిపాదనను ఆయన ముందుంచారు. అయితే మిగిలిన 19మంది కూడా హైకోర్టు స్టేలను తొలగించుకొని స్వచ్ఛందంగా దుకాణాలను తొలగించిన తర్వాత మాత్రమే తాను తీసుకునే నిర్ణయాన్ని వెల్లడిస్తానని స్పష్టం చేశారు. అప్పటి ఎమ్మెల్యే, జిల్లా మంత్రి మధ్య ఉన్న వైరుధ్యాల వలన నాటి కలెక్టర్ ఎమ్మెల్యే చేసిన విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకోకపోవడంతో సమస్య జటిలమైందనే విమర్శలున్నాయి. ఇక్కడి దుకాణాల వారి విజ్ఞప్తి మేరకు నాటి కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లయితే ఈ పాటికే వైరాలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తయి ఉండేదని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. అందుకు భిన్నంగా కలెక్టర్ ఉండటంతో సమస్య పరిష్కారం కాలేదనే విమర్శలు కూడా ఉన్నాయి. ఈ పరిస్థితి ఇలా ఉంటే హైకోర్టులో ఉన్న 19మంది స్టేలను తొలగించేందుకుగానూ మునిసిపల్, రెవెన్యూ అధికారులు ప్రతిష్టాత్మకంగా చర్యలు తీసుకోలేదనే విమర్శలు కూడా ఉన్నాయి.

స్టే తెచ్చుకున్న వారితో ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడి చర్చలు

ఇదిలా ఉంటే ప్రభుత్వ స్థలాల్లో దుకాణాలకు స్టే తెచ్చుకొని ఉన్న వారితో కొంతకాలం కిందట ఎమ్మెల్యే మాలోతు రాందాస్నాయక్, స్థానికుడు, మాజీ సర్పంచ్ అయిన డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ చర్చలు జరిపారు. వివిధ పార్టీల నాయకులతో కూడా ఇదే విషయమై వారు చర్చించారు. వైరా మండలానికే చెందిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వైరాను అభివృద్ధి చేసేందుకుగానూ అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని రాందాస్నాయక్కు, దుర్గాప్రసాద్కు స్పష్టమైన సూచనలు చేయడంతో వారు ఆదిశగా స్టే ఉన్న వారితో చర్చలు జరిపారు. ఖమ్మం రోడ్డు వైపు ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలకు స్టే పొందిన వారు శాశ్విత దుకాణ సముదాయాన్ని నిర్మించి తమకు లీజుకు ఇస్తే స్టేను ఉపసంహరించుకొనేందుకు సుముఖత వ్యక్తం చేశారు. మధిర-జగ్గయ్యపేట రోడ్డులో దుకాణాలకు స్టే తెచ్చుకున్న వారు మాత్రం సానుకూలంగా స్పందించలేదు. ఆతర్వాత మళ్లీ ఈ సమస్యపై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టిసారించకపోవడంతో ఎలాంటి పురోగతీ కన్పించలేదు.


వైరా-జగ్గయ్యపేట రోడ్డుపక్కన దుకాణాల శిథిలాలు


హైకోర్టు స్టేతో కొనసాగుతున్న ప్రైవేట్ వ్యక్తుల దుకాణాలు

జేఈఈ ఫలితాల్లో..
ప్రభుత్వ కళాశాలల వెనుకంజ

40 మందికి నలుగురే అర్హత.. సిలబస్ చెప్పలేని అధ్యాపకులు

ఖమ్మంఖానాపురంహవేలీ ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 21 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో, 14 బీసీ గురుకులాల్లో, 14 మైనారిటీ గురుకులాల్లో శనివారం విడుదలైన 2025 జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో అధ్యాపకుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే మొత్తం 40 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా కేవలం నలుగురు విద్యార్థులే అర్హత సాధించారు. మైనారిటీ గురుకులం నుంచి , బీసీ గురుకులం నుంచి కొందరు విద్యార్థులే పరీక్షకు హాజరుకాగా ఎంత మంది అర్హత సాధించారో తెలియని పరిస్థితి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జేఈఈ మెయిన్స్ సిలబస్ చేప్పే అధ్యాపకులు ఉన్నారా అనే సందేహం కలుగుతోంది. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎంత మంది విద్యార్థులు జేఈఈ మెయిన్స్ పరీక్షకు హాజరైన విషయం జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కార్యాలయంలో వివరాలు లేకపోవటం ఆశ్చర్యం. కార్యాలయంలో కేవలం కొంత మంది సిబ్బంది నెలవారి జీతాలు తీసుకొని కాలక్షేపం చేయటం తప్ప ఎలాంటి పనులూ చేయటంలేదని, దీనికి ఈ శాఖ అధికారి అంతా తానై ప్రైవేటు జూనియర్ కళాశాలలకు, అకాడమీలకు అనుకూలంగా ఉండటమే కారణంగా చెప్పవచ్చు. 2024-25 విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, గురుకులాల్లో ప్రభుత్వం ఉచిత ఎప్సెట్, నీట్, జేఈఈకి ప్రత్యేక శిక్షణ అందించాలని ఆదేశాలు జారీచేసింది. ప్రభుత్వ కళాశాలల్లో ఎక్కువగా పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులే చదువుతున్నారు. ప్రతిభ ఉన్నా సరైన ప్రోత్సాహం, శిక్షణ లేక వైద్య విద్య, ఇంజనీరింగ్ కోర్సులకు ఎంపిక కాలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్ది, వారి కలలు సాకారం చేసేలా ఇంటర్మీడియట్ బోర్డు కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ద్వితీయ సంవత్సరం చదువుతున్న సుమారు 4వేల మంది ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ప్రైవేటుకు దీటుగా ఎప్సెట్, నీట్, జేఈఈలకు సంబంధించి ఉచిత శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి గత ఏడాది విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు. ఎంసెట్, నీట్, జేఈఈలలో నిష్ణాతులైన అధ్యాపకులచే రెండు నెలల పాటు శిక్షణ అందించాలని సూచించారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా స్టడీ మెటీరియల్ సరఫరా ప్రభుత్వం చేయనుంది. కాని జిల్లాలో ఎక్కడ ప్రత్యేక శిక్షణ అందించిన దాఖలాలు లేకపోవటంతో జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో విద్యార్థులు రాణించలేకపోయారు. దీనితో పాటు రానున్న ఎప్సెట్ తదితర పోటీ పరీక్షల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు వెనుకబడుటకు ముఖ్య కారణం జిల్లా ఇంటర్మిడియట్ కార్యాలయ అధికారి, కొందరు అధ్యాపకులేననే వాదనలు వినపడుతున్నాయి.

భూ భారతితో భూ సమస్యలకు పరిష్కారం

కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనులు, గిరిజనేతరుల భూ సమస్యలకు భూ భారతితో పరిష్కారం లభిస్తుందని, ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే ప్రజల జీవన విధానం మానవీయ కోణంతో ముడిపడి ఉందని జిల్లా కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఎమ్మెల్యే కోరం కనకయ్య స్పష్టం చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే ప్రజలు ఎలాంటి ఆందోళనలకు గురికావద్దని, గిరిజన చట్టాలకు భంగం కలగకుండా అన్ని వర్గాల ప్రజలకు భూ వివాదాలు భూ భారతి ద్వారా పరిష్కారం లభిస్తుందని భరోసానిచ్చారు. ఆదివారం ఇల్లెందు మండలం బొజ్జాయిగూడెం వద్ద భూ భారతి చట్టం అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల భూ సమస్యలకు వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. కలెక్టర్ జితేశ్ వి పాటిల్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులు, గిరిజనేతరులు పుట్టిపెరిగారని, సహజీవనం చేశారని ఎవరికీ అన్యాయం జరగకుండా మానవీయ కోణంతో సాగాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఆర్డీ వో మధు, తహసిల్దార్ కోట రవికుమార్, ఎంపీడీవో ధన్సింగ్, వ్యవసాయాధికారి సతీశ్ పాల్గొన్నారు. సమావేశంలో ఆదివాసీ సంఘాల నాయకుడు ఆరెం పాపారావుతో పాటు గిరిజనేతరులు జిల్లా కలెక్టర్కు ఏజెన్సీ ప్రాంతాల్లో తలెత్తిన పలు భూ వివాదాలను వివరించారు.


టేకులపల్లిలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

భూ భారతి చట్టంతో రైతులకు మేలు

టేకులపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టంతో నిరుపేదలకు ఎంతో మేలు జరుగుతుందని కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఆదివారం భూ భారతిపై టేకులపల్లి తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన అవగాహణ సదస్సులో జిల్లా కలెక్టర్ జితేష్ విపాటిల్తో కలిసి ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడారు. భూ భారతి కీలక అంశాలను కలెక్టర్ రైతులకు వివరించారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రైతులు దగాపడ్డారన్నారు. ఈ చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహణ కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఆర్డీవో మధు, తహసీల్దార్ నాగభవానీ, ఎంపీడీవో రవీందర్రావు, ఏడీఏ లాల్చంద్, ఏవో అన్నపూర్ణ, సొసైటీ అధ్యక్షులు లక్కినేని సురేందర్రావు, రైతులు పాల్గొన్నారు.


ఇల్లెందులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కనకయ్య

లారీ ఢీకొని.. ఒకరి మృతి

ఇద్దరికి తీవ్రంగా.. మరొకరికి స్వల్ప గాయాలు

నేలకొండపల్లి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఆదివారం రాత్రి లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న సంఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. అదే లారీ తిరుమలాపురంతండా వద్ద మరో వ్యక్తిని ఢీకొట్టగా అతను గాయపడ్డాడు. వివరాల ప్రకారం సూర్యాపేటకు చెందిన ఖాళీ లారీ ఖమ్మం వైపు నుంచి కోదాడ వైపు వెళుతూ మండల పరిధిలోని బోదులబండ అండర్పాస్ వద్ద ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో ద్విచక్రవాహనంపై ఉన్న హరికరణ్ (32) అక్కడికక్కడే మృతి చెందగా, రాంజీలాల్, బహదూర్లు తీవ్రంగా గాయపడ్డారు. తీవ్రంగా గాయపడ్డ వారిని నేలకొండపల్లి సీహెచ్సీకి తరలించి ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కాగా మృతుడితో పాటు మిగిలిన ఇద్దరు రాజస్థాన్కు చెందిన వారు. బోదులబండకు సమీపంలోని ఓక్వారీలో పని చేస్తున్న వారు, ఆదివారం రాత్రి తమ విధులను ముగించుకుని ఇంటికి వెళుతుండగా ఈ ప్రమాదం సంభవించింది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన లారీ తిరుమలాపురంతండా అండర్పాస్ వద్ద మరో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ద్విచక్రవాహనంపై ఉన్న భూక్యా సాయి అనే వ్యక్తి గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు తిరుమలాపురంతండా వద్ద సంఘటనా స్థలానికి వెళ్ళి ప్రమాదానికి కారణమైన లారీని స్వాధీనం చేసుకుని పోలీస్స్టేషన్కు తరలించారు. డ్రైవర్ పూర్తిగా మద్యం మత్తులో లారీని నడిపినట్లుగా పోలీసులు చెప్పారు. ఇదిలా ఉండగా మృతుడు నెల రోజుల క్రితంరాజస్థాన్ వెళ్ళి శనివారం వచ్చి డ్యూటీలో చేరినట్లు తెలుస్తున్నది. నేలకొండపల్లి ఎస్ఐ పెంటరి సంతోష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


హరికిరణ్ మృతదేహం

రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు

మణుగూరు టౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మణుగూరు పట్టణంలోని గుట్టమల్లారం ప్రధాన రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. అశోక్ నగర్లో నివాసముంటున్న మండెపూడి నాగేశ్వరరావు తన భార్య సరిత ఇద్దరు పిల్లలతో కలసి అశ్వాపురంలో ఓ ఫంక్షన్కు టూవీలర్పై వెళ్లి వస్తుండగా గుట్టమల్లారం వద్ద వెనక నుంచి వస్తున్న కారు ఢీ కొంది. ఈ ప్రమాదంలో నాగేశ్వరరావుకు తలకు మోచేతి గాయాలయ్యాయి. భార్య సరిత, పిల్లలు దీపక్కుమార్, సిరి చందనలకు గాయాలయ్యాయి. నాగేశ్వరరావు పరిస్థితి విషమంగా ఉండటంలో భద్రాచలం తరలించారు.

నేడు మధిరలో మెగా జాబ్మేళా

80 కంపెనీలు, 5వేలకు పైగా ఉద్యోగాలు

ప్రత్యేక చొరవ తీసుకున్న డిప్యూటీ సీఎం భట్టి

మధిరటౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మధిరలోని రెడ్డి గార్డెన్స్లో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మార్గదర్శకత్వంలో సోమవారం నిర్వహించనున్న మెగా జాబ్మేళాకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ జాబ్మేళా ద్వారా 5వేల పైగా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు 80కి పైగా కంపెనీలు మధిరకు రానున్నాయని అధికారులు తెలిపారు. నియోజకవర్గంలో ఉన్న నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవ తీసుకుని హైదరాబాద్లో ఉన్న అనేక కంపెనీలను ఈ జాబ్మేళాకు రప్పిస్తున్నారు. పదవ తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లొమా, ఫార్మసీ, బీటెక్ చదివిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. జాబ్మేళాకు వచ్చే నిరుద్యోగులు రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు వారిని ఇంటర్వ్యూలు చేసేందుకు కంపెనీల ప్రతినిదులకు అన్ని ఏర్పాట్లు చేసారు, జాబ్మేళాకు హాజరయ్యే వారు 9000037805 నెంబర్కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చునని అధికారులు తెలిపారు.

మానసిక స్థైర్యం పెంచడానికే మోడల్ పరీక్షలు

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నీట్, ఎంసెట్ మోడల్ పరీక్షలు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): విద్యలో తీవ్రమైన పోటీతత్వం ఏర్పాడటంతో విద్యార్థులు మానసిక ఇబ్బందులకు గురవుతున్నారని, వారిలో మానసిక స్థైర్యాన్ని పెంపొందించటానికే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం మోడల్ పరీక్షలు నిర్వహించటం జరుగుతుందని సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సభ్యులు ఇటికల రామకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా వ్యాప్తంగా పలు కాలేజీల్లో 2025 నీట్, ఎంసెట్ మోడల్ పరీక్షలు నిర్వహించారు. ఖమ్మం కేంద్రంలో బాగం హేమంతరావు పరీక్షా కేంద్రాలకు వెళ్లి పరీక్షల తీరును పరిశీలించి విద్యార్థులకు పరీక్షా పత్రాలను అందించారు. ప్రశాంతమైన వాతావరణంలో పోటీ పరీక్షలను ఎదుర్కోవాలని పేర్కొన్నారు. మోడల్ పరీక్షలు రాయటం ద్వారా విద్యార్థులకు మంచి అవగాహన పెరుగుతుందన్నారు. ఆధునిక సమాజంలో విద్యార్థులకు అనేక రంగాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ 26 ఏళ్లగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మోడల్ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్, నాయకులు నాగుల్మీరా, శివనాయక్, ఉస్మాన్, ప్రతాప్, రాకేష్, రోహిత్, రాహుల్ గోపి పాల్గొన్నారు.


విద్యార్థులకు ప్రశ్నాపత్రాలు అందజేస్తున్న దృశ్యం

వక్ఫ్ సవరణ చట్టంతో పేద ముస్లింలకు మేలు

కొత్త చట్టంతో మైనారిటీ మహిళలకు మేలు

బీజేపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసగౌడ్, హైకోర్టు అడ్వకేట్ సుంకర మౌనిక, జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు

ఖమ్మంబైపాస్రోడ్, ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): వక్ఫ్బోర్డు చట్టంతో పేద ముస్లింలు, మైనారిటీ మహిళలకు ఎంతో మేలు చేకూరుతుందని బీజేపీ రాష్ట్ర నాయకురాలు సుంకరమౌనిక, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాసగౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు అన్నారు. వక్ఫ్ చట్ట సవరణ 2025 జనజాగరణ అభియాన్ పేరుతో నగరంలోని ఓ హోటల్లో ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆధ్వర్యంలో వర్క్షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటివరకు అమలైన వక్ఫ్బోర్డు చట్టంతో పేద, మధ్యతరగతి ముస్లింలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, ముఖ్యంగా మైనారిటీ కుటుంబాల్లో యువతలు వివాహం చేసే హక్కు కూడా వక్ఫ్ బోర్డు నిర్ణయం మేరకు జరిగేదన్నారు. తల్లిదండ్రుల ఆస్తుల్లో మహిళలకు హక్కులేకుండా వక్ఫ్బోర్డు కఠినంగా వ్యవహరించేదన్నారు. దేశ పౌరుల ప్రతిష్టను కాంగ్రెస్తో సహా ప్రతిపక్షనేతలు ప్రపంచ దేశాలకు తాకట్టు పెట్టారన్నారు. వందలో 70శాతం మందికి అన్యాయం జరిగితే కేవలం ధనిక ముస్లింలకు మాత్రమే గతంలో మేలు జరిగేదని, 2013లో యూపీఏ హయాంలో దానిని కాంగ్రెస్ చట్టంగా మార్చి వక్ఫ్బోర్డుకు అనేక హక్కులను కలిపించి దోచుకోవడానికి నాంది పలికిందని విమర్శించారు. దేశానికి స్వాతంత్రం తెచ్చింది మేమే అని జబ్బలు చరుచుకునే కాంగ్రెస్ నేతలు వారికి వత్తాసు పలుకుతూ పబ్బం గడిపే కమ్యూనిస్టు, బీఆర్ఎస్ పార్టీలు, ఇతర పార్టీలు వక్ఫ్చట్ట సవరణ గురించి ముస్లిం మైనారిటీలను భయాందోళనకు గురిచేస్తూ దేశాన్ని అగ్నిగుండంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. అనంతరం నరేంద్రమోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈకార్యక్రమంలో నంబూరి రామలింగేశ్వరరావు, విజయరాజు, ఈవీ రమేష్, రవి, రాజేష్, కొల్లిపాక శ్రీదేవి, ఎస్కే యాకుబ్పాషా, పమ్మి అనిత తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సుంకర మౌనిక


మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

చదువుతోనే సమస్యల పరిష్కారం

భద్రాచలం ఎమ్మెల్యే 'తెల్లం'


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట్రావు

భద్రాచలం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఆదివాసీలు చదువుకోవాలని, చదువు మాత్రమే సమస్యలపై అవగాహన, సమస్యల పరిష్కార విధానం తెలుస్తుందని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. మహిళలు వ్యవసాయ సంక్షోభం నందు ఎదుర్కొంటున్న సమస్యలు వాటి స్వభావం గురించి వివరించారు. ఆదివారం పట్టణంలోని హరిత హోటల్లో వ్యవసాయక, సాంఘీక అభివృద్ధి సంస్థ, స్వచ్ఛంద సంస్థలు సంయుక్త ఆధ్వర్యంలో వ్యవసాయ సమస్యల సందర్భంలో గ్రామీణ మహిళలపై హింసను అర్థం చేసుకోవడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాల నుంచి 120మంది మహిళ రైతులు పాల్గొనగా ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

కార్యక్రమంలో ఏఎస్డీఏస్ సంస్థ డైరెక్టర్ గాంధీబాబు, స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్లు రుక్మిణీ, ఆశాలత, ఇందిర, సీతామహలక్ష్మీ, నాగరాజు, జమున, తదితరులు పాల్గొన్నారు.

రెండు రాష్ట్రాల సినీ ట్రాక్ సింగింగ్ పోటీల్లో విజేతగా భద్రాద్రి వాసి

భద్రాచలం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో ఎస్ఎస్ ఎంటర్టైర్మెంట్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన రెండు రాష్ట్రాల స్థాయి సినీ ట్రాక్ సింగింగ్ పోటీలలో విజేతగా భద్రాచలానికి చెందిన పోకల శ్రీనివాసరావు నిలిచారు. ఈ పోటీల్లో రెండు రాష్ట్రాల నుంచి 75 మంది గాయకులు పాల్గొనగా అందులో భద్రాచలానికి చెందిన శ్రీనివాసరావు విజేతగా నిలిచారు. దీంతో ఆయనకు రూ.5వేల నగదును నిర్వహకులు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ను పలువురు అభినందించారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా రాజబాబు, సంగీత ఉపాధ్యాయురాలు సరళ వ్యవహరించారు. సినీ సంగీత విభావరిలో గాయనీ, గాయకులు పాటలను ఆలపించారు.


అవార్డు అందుకుంటున్న శ్రీనివాస్

భోజనం, మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

ఖమ్మంచర్చికాంపౌండ్, ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): బాలుచారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మంనగరంలోని కన్యకపరమేశ్వరి ఆలయం వద్ద వృద్ధులకు, దివ్యాంగులకు పండ్లు, భోజనం, మజ్జిగ ప్యాకెట్లు ను పంపిణీ చేశారు. ట్రస్టు చైర్మన్ చెరుకుపల్లి బాలు మాట్లాడుతూ ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని యాచకులు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.చాలా మంది వడదెబ్బకు సొమ్మసిల్లి పడిపోతున్నారనని, వారికోసం తనవంతుగా ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ చెరుకుపల్లి బాలు, సీహెచ్ ప్రవళిక, పంది వేణు, కె.సైదులు,పడిశల వీరస్వామి,సీతారాములు, కాశయ్య, చుక్కయ్య పాల్గొన్నారు.

ముగిసిన చెస్ పోటీలు



విజేతలతో నాగేంద్రకుమార్

ఖమ్మంస్పోర్ట్స్, ఏప్రిల్20 (ఆంధ్రజ్యోతి): జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని సర్వజ్ఞ పాఠశాలలో నిర్వహించిన ఉమ్మడి ఖమ్మం జిల్లాస్థాయి చెస్ పోటీలుముగిశాయి. పోటీలలో అండర్-10, 13, 16 బాలురు, బాలికలకు విడివిడిగా పోటీలు నిర్వహించారు. పోటీలకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి సుమారు 42 మంది క్రీడాకారులు హాజరైనారు. పోటీల అనంతరం విజేతలకు పాఠశాల డైరెక్టర్ నాగేంద్రకుమార్, నిర్వాహకుడు గోపీక్రిష్ణ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర చెస్ అసోసియేషన్ ఈసీ మెంబర్ జ్యోత్స్న, పలువురు పాఠశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

'రాజీవ్ యువ వికాసం' అగచాట్లు

- డివిజన్లు వారీగా దరఖాస్తుల విభజనలో జాప్యం
- సింగిల్ కంప్యూటర్‌పై కుస్తీ పడుతున్న అధికారులు
- మెప్మాలో ఆరు నెలలుగా మూలనపడిన కంప్యూటర్లు



మూలనపడిన కంప్యూటర్లు, ఒకే కంప్యూటర్‌లో ఆన్‌లైన్ చేస్తున్న ఉద్యోగి, వచ్చిన దరఖాస్తులు

ఖమ్మంసంక్షేమవిభాగం,ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసానికి ఆదిలోనే అగచాట్లు తప్పటం లేదు. ఈ పథకానికి దరఖాస్తులు ఖమ్మం జిల్లాలోనే అత్యధికంగా 14వేలకు పైగా దరఖాస్తులను మెప్మా అధికారులు కౌంటర్ల ద్వారా సేకరించారు. వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలనకు స్వీకరించిన దరఖాస్తులను డివిజన్లు వారీగా విభజన చేయాల్సి ఉంటుంది.

సింగిల్ కంప్యూటర్‌తో కుస్తీ

ఖమ్మం నగరంలో రాజీవ్ యువ వికాసం 14వేల దరఖాస్తులను పరిశీలన చేసేందుకు మెప్మా కార్యాలయంలో సింగిల్ కంప్యూటర్ మాత్రమే అందుబాటులో ఉంది. రెండు రోజులుగా కలెక్టర్ కార్యాలయం నుంచి కేఎంసీ కార్యాలయానికి వచ్చిన బీసీ, ఎస్సీ, మైనార్టీ సంక్షేమశాఖల అధికారులు సింగిల్ కంప్యూటర్‌పైనే కుస్తీ పడుతున్నారు. కనీసం 10శాతం దరఖాస్తులు కూడా డివిజన్‌ల వారీగా విభజన జరగలేదని తెలుస్తోంది. ఈనెల 24వరకు దరఖాస్తుల పరిశీల సైతం పూర్తి కావాల్సి ఉంది. కానీ ఖమ్మం నగరంలో దరఖాస్తులు డివిజన్‌ల వారీగా విభజనకే మరో వారంరోజులకు పైగా పట్టే పరిస్థితి ఏర్పడింది.

ఆరు నెలలుగా మూలనపడిన కంప్యూటర్లు

ఖమ్మం నగరంలోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా)లో టీఎంసీతో పాటుగా నల్గురు కమ్యూనిటీ ఆర్గనైజర్లు, కంప్యూటర్ అపరేటర్లు ఉంటారు. వీరందిరికి కలిసి మెప్మా కార్యాలయంలో 1996లో స్త్రీనిధి ద్వారా ఆరు కంప్యూటర్లు అందించారు. తర్వాత నూతన కంప్యూటర్లు మంజూరు కాలేదు.దశల వారీగా కంప్యూటర్లు మోరాయించాయి. ఆరునెలలుగా టీఎంసీతో పాటుగా మరో ముగ్గురు కమ్యూనిటీ ఆర్గనైజర్ల కంప్యూటర్లు మూలక చేరాయి. దీంతో నూతన సంఘాల ఆన్‌లైన్ నుంచి, బ్యాంకు లింకేజీ, మహిళా శక్తిరుణాలు, ముద్ర రుణాలు, సెర్ప్ రుణాలు, వీధివ్యాపారుల రిజిస్ట్రేషన్,ఆన్‌లైన్,రుణాలు మంజూరుకు కంప్యూటర్ కష్టాలు ఏర్పడ్డాయి. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యుల ప్రొఫైలింగ్ చేయలేకపోతున్నారు. మెప్మా సైట్‌లో చేసిన వివరాలను జాతీయ పోర్టల్ నేషనల్ అర్బన్ లైవ్లీ హుడ్ మిషన్(ఎన్‌యూఎల్‌ఎం)కు పంపటంలో జాప్యం ఏర్పడుతుంది. క్షేత్రస్థాయిలో ఆర్పీల నుంచి జిల్లా మిషన్ కో ఆర్డినేటర్ వరకు చేసిన పనిని ఆన్‌లైన్‌లో నమోదు చేయలేకపోతున్నారు.

కమిషనర్ ఆదేశాలిచ్చినా..

కాగా మెప్మాకు కంప్యూటర్లు ఏర్పాటు చేయాలని మూడు నెలల క్రితమే ఇంజనీరింగ్ అధికారులకు కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశాలిచ్చారు. కానీ కంప్యూటర్లు ఫైల్ మాత్రం ముందుకు కదలలేదు. ఇప్పటికైనా కేఎంసీ అధికారులు మెప్మాకు కంప్యూటర్లు అందిస్తే ఇటు మెప్మాతో పాటుగా రాజీవ్ యువ వికాసం ఇతర అవసరాలకు కంప్యూటర్ ఇక్కట్లు తొలగనున్నాయి.

రాజ్యాంగ పరిరక్షణ బాధ్యత సుప్రీం కోర్టుదే

గొల్లపూడి రామారావు

ఖమ్మంలీగల్, ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతిని సుప్రీకోర్టు ఆదేశించ జాలదంటూ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ వ్యాఖ్యానించటం చట్ట విరుద్ధమని, కోర్టు ధిక్కారం కిందకు వస్తుందని తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్లపూడి రామారావు అన్నారు. సుప్రీం కోర్టు తీర్పుపై రాజకీయ నాయకులు మాట్లాడుతున్న తీరుపైఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రాజ్యాంగ బద్ధ పదవిలో ఉన్న ఉపరాష్ట్రపతి సుప్రీం కోర్టు తీర్పును వ్యతిరేకించటం సరికాదన్నారు. వెంటనే ఆయన తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఉపరాష్ట్రపతి మాటలతో ప్రజల్లో న్యాయ వ్యవస్థపై నమ్మకం పోయేలా ఉందన్నారు. కోర్టులే చట్టాలు చేస్తే పార్లమెంట్ ఎందుకని కొందరు ఎంపీలు, ఎమ్మెల్యే మాట్లాడటం వారి అజ్ఞానానికి నిదర్శనమన్నారు. ప్రజాప్రతినిధులు తమకు అనుకూలంగా తీర్పు వస్తే ఒకలా, వ్యతిరేకంగా వస్తే మరోలా మాట్లాడి రాజ్యాంగాన్ని అభాసుపాలు చేయవద్దని ఆ ప్రకటనలో గొల్లపూడి రామారావు హితవు పలికారు.

రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తున్న బీజేపీ

- మేయర్ పునుకొల్లు నీరజ
- 42వ డివిజన్‌లో జైసంవిధాన్ యాత్రకు హాజరు



ర్యాలీలో పాల్గొన్న మేయర్ నీరజ

ఖమ్మంసంక్షేమవిభాగం, ఏప్రిల్20 (ఆంధ్రజ్యోతి): పదేళ్లుగా దేశాన్ని పరిపాలిస్తున్న బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని, లౌకిక స్ఫూర్తికి విఘాతం కలిగిస్తోందని మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. జైభీమ్, జైసంవిధాన్ యాత్రను ఆదివారం 42వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ పాకాలపాటి విజయనిర్మల ఆధ్వర్యంలో చేపట్టారు. ర్యాలీలో మేయర్ పునుకొల్లు నీరజ పాల్గొని ప్రసంగించారు. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ ఏర్పడిన మనదేశంలో బీజేపీ ప్రభుత్వం అప్రజాస్వామికంగా పరిపాలన చేస్తోందన్నారు. రాజ్యాంగ విలువలపై పోరాడాల్సిన బాధ్యత ప్రతీపౌరుడిపై ఉందన్నారు. ఈసందర్భంగా రాష్ట్రంలో 15 నెలల కాంగ్రెస్ పరిపాలనపై మేయర్ వివరించారు. ఖమ్మం ఏఎంసీ చైర్మన్ యర్రగర్ల హనుమంతరావు,ఉపమేయర్ పాతిమాజోహరా, డీసీసీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కాంగ్రెస్ నాయకులు పాకాలపాటి శేషగిరి, ముక్తార్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య పాల్గొన్నారు.

భక్తరామదాసు కళాక్షేత్రం అభివృద్ధికి కృషి

ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ

ఖమ్మంఖానాపురంహవేలి, ఏప్రిల్20 (ఆంధ్రజ్యోతి): భక్తరామదాసు కళాక్షేత్రం అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి హామీ ఇచ్చారు. ఖమ్మం నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన 93వ నెలనెల వెన్నెల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భక్తరామదాసు కళాక్షేత్రాన్ని గతంలో ఎందరో ప్రజాప్రతినిధులు, అధికారులు అభివృద్ధి చేశారని, ఇంకా అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. కళలు తగ్గిపోతున్న ఈ రోజుల్లో నెలనెల వెన్నెల నిర్వాహకులు ఇటువంటి కార్యక్రమాలు చేయటం అభినందనీయం అన్నారు. ఖమ్మం కళాకారుడు నాగసాయి నటించిన లఘు చిత్రం, సినీ నటుడు ఎల్బీ శ్రీరామ్ నటించిన పసుపు కుంకుమ లఘు చిత్రాలను ప్రదర్శించారు. హక్కు నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది. వడ్డే ఆచరణ కూచిపూడి నాట్యం, ప్రణవిక సాయి భరతనాట్యం అబ్బురపరిచాయి. ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి మెంతుల శ్రీశైలం, కాంగ్రెస్‌నాయకుడుమహమ్మద్ ముస్తాఫా, నిర్వాహకులు సుబ్రమణ్య కుమార్, జగన్ మోహన్‌రావు, నాగబత్తిని రవి, సదానంద్, జాబిశెట్టి పాపారావు పాల్గొన్నారు.

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు



నేలకొండపల్లిలో, కూసుమంచి, గోళ్లపాడులో కేక్ కట్‌చేస్తున్న టీడీపీ నాయకులు

నేలకొండపల్లి, ఏప్రిల్20 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 75వ జన్మదిన వేడుకలను ఆదివారం నేలకొండపల్లి పీఎస్సార్ సెంటర్లో టీడీపీ కార్యకర్తలు నిర్వహించారు. జన్మదిన కేక్‌ను కట్ చేశారు. సెంటర్లో బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో సూరపనేని రామకృష్ణ, నలమాస మల్లయ్య, వీసంశ్రీను కట్టా రాజేష్, అక్కినేని నాగేశ్వరరావు, మద్దినేని మహేష్, దుడ్డెల గోపాలరావు, పావులూరి వెంకటేశ్వరరావు, తీగ వెంకటేశ్వర్లు, గోగినేని సీతారాంబాబు,తాటికొండ నాగేశ్వరరావు, తాడేపల్లి వెంకటేశ్వర్లు, నూక హనుమంతరావు, నల్లమల వెంకటేశ్వర్లు,కాసాని బడేమియాపచ్చా సీతరామయ్య, ఈగా జాలయ్య పాల్గొన్నారు.



18వ డివిజన్‌లో వేడుకల్లో పాల్గొన్న కూరపాటి, ఖమ్మం కాల్వొడ్డులో..

తిరుమలాయపాలెం: కాకరవాయి, తిప్పారెడ్డిగూడెం, పిండిప్రోలు, తిరుమలాయపాలెంలో వేడుకలు నిర్వహించారు. తిరుమలాయపాలెంలో టీడీపీ జిల్లానాయకులు కొండబాల కరుణాకర్ కేక్‌కట్ చేసి పంపిణీచేశారు. ఈకార్యక్రమంలో కొప్పుల వెంకటరావు, కొలిశెట్టి బిక్షం, రత్నాచారి,మల్లీడి భాగ్యమ్మ,రమేష్‌పాల్గొన్నారు.

ఖమ్మంమామిళ్లగూడెం: రేపాల సీతారామయ్య ఆధ్వర్యంలో వేడుక నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ ఖమ్మం పార్లమెంటు మాజీ అధ్యక్షుడు కూరపాటి వెంకటేశ్వర్లు కేక్ కట్ చేశారు.ఈ కార్యక్రమంలో వడ్డెం విజయ్, గుండె పిన్ని నాగేశ్వరరావు, అత్తునూరి రాజు, మల్లెల సత్యం,శేఖర్‌సాయి పాల్గొన్నారు.

నేషనల్ హెరాల్డ్ ద్వారా వేల కోట్ల కుంభకోణం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి



ర్యాలీగా వెళుతున్న బీజేపీ నాయకులు

ఖమ్మంబైపాస్‌రోడ్,ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): నేషనల్ హెరాల్డ్ పత్రిక పేరుతో కాంగ్రెస్ పార్టీ వేల కోట్ల కుంభకోణం చేసిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు ఆరోపించారు. నేషనల్‌హెరాల్డ్ కేసులో రాహుల్ గాంధీ, సోనియాగాంధీ పేర్లు రావడంతో తెలిసిందే.. ఈనేపథ్యంలో అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ ఎంపీలు, అద్దంకి దయాకర్, అంజన్‌కుమార్ తీరుకు నిరసనగా ఆదివారం రాలీ నిర్వహించారు. రూ.90కోట్లు పెట్టుబడి పెట్టి వేల కోట్లు ఆస్తులు దోచుకుంటుంటే న్యాయవ్యవస్థ చూస్తూ ఉరుకుంటుందా అని ప్రశ్నించారు. అద్దంకి దయాకర్, అంజన్‌కుమార్ వెంటనే వ్యాఖ్యలు వెనిక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నంబూరి రామలింగేశ్వరరావు, విజయరాజు, ఈవీ రమేష్, రవి, రాజేష్, కొల్లిపాక శ్రీదేవి, ఎస్‌కే యాకుబ్ పాషా, పమ్మి అనిత తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

పెనుబల్లి,ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి):తమతో పాటు చదువుకున్న మిత్రుడు అకాల మరణంతో కుటుంబం ఇబ్బందుల్లో ఉండటంతో స్నేహితులు ఆదివారం ఆర్థికసాయం అందించారు. వీఎంబంజర్ పాఠశాలలో 1996-97 పదోతరగతి చదువుకున్న మండలంలోని అగ్రహారం గ్రామానికి చెందిన గొల్లమందల వెంకటేశ్వరరావు(వెంకట్) కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఇటీవల మృతిచెందాడు. మిత్రుడు కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశ్యంతో స్నేహితులు వెంకటేశ్వరరావు కుమారుడు పవన్‌కల్యాణ్, కుమార్తె స్వాతిలకు రూ.36,700తోపాటు 50కేజీల బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో పలగాని ఈశ్వర్, కోట శ్రీనివాసరావు, షేక్.బాజీ, వెంకటాచారి, మందా వెంకటేష్ పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు

ఏన్కూరు,ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గంగులనాచారంలో ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాల స్థాయి కబడ్డీ పోటీలను ఈనెల 25,26,27 తేదీలలో నిర్వహిస్తున్నట్టు ఆహ్వాన కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. గ్రామపెద్దలు, కొమరం భీంయూత్ ఆధ్వర్యంలో పోటీలను నిర్వహించనున్నారు. ఈనెల24లోపు సంప్రదించాలని కోరారు.

సుబాబుల్ పంట దగ్ధం

బోనకల్,ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి):మండలంలోని ఆళ్లపాడు, రాయనపేట గ్రామాల్లో సుబాబుల్, మక్క పంటలు ఆదివారం అగ్గికి కాలి బూడిదయ్యాయి. కొందరు వ్యక్తుల నిర్లక్ష్యం పంట చేల రైతులకు శాపంగా మారాయి. లక్షలాది రూపాయల పంట అగ్నికి ఆహుతిగా మారడంతో రైతుల రోదనలు మిన్నంటాయి. ఆళ్లపాడుకు చెందిన మలాది అచ్చయ్య నారాయణపురం మైనర్ కాలువ పరిధిలో రెండు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని మక్క పంటను సాగు చేశాడు. పంట బాగ పండటంతో 80 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని ఎంతగానో సంతోషపడ్డాడు. కంకి విరుపుకు రాగా ఈదురు గాలుల వలన పంట నేల మట్టమైంది. మిషన్ పట్టే అవకాశం లేక పోవడంతో పాటు కూలీల కొరత వలన పంట చేలోనే ఉంది. గుర్తు తెలియని వ్యక్తులు చెత్తకు నిప్పంటించడం వలన మంటలు మక్క పైరుకు వ్యాపించాయి. రెండు ఎకరాల్లో పంట అంత కాలి బూడిదైంది. పక్కనే ఉన్న కొందరి రైతుల పొలాల్లో మక్క కంకులు కూడ కాలిపోయాయి. మంటలు పొలాలకు వ్యాపించడంతో దగ్గరలో ఉన్న బొమ్మినేని హన్మంతరావుకు చెందిన 3 ఎకరాల్లోని సుబాబుల్ దగ్ధమైంది. అగ్ని వలన దాదాపు 6లక్షలకు పైగా పంట నష్టం జరిగిందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఫైరింజన్ వచ్చేలోపు పంటలన్ని దగ్ధమయ్యాయి.

కంటి వైద్యశిబిరం

తిరుమలాయపాలెం, ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏలువారిగూడెంలో ఆదివారం ఖమ్మంకు చెందిన ఎస్‌వీఐకేర్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈశిబిరంలో డాక్టర్ కే విజయ్ ప్రకాష్ రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. ఈకార్యక్రమంలో దేవేందర్‌రెడ్డి,అశోక్‌రెడ్డి, నారాయణ, వెంకటాచారి, వెంకన్న పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు

ఖమ్మంఖానాపురంహవేలి,ఏప్రిల్20 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఆదివారం క్రైస్తవులు ఈస్టర్ పండుగ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. జిల్లాలోని పలు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నగరంలోని ఆర్‌సీఎం, పెంతుకోస్తు, కరుణగిరి తదితర చర్చిలలో క్రైస్తవులు ఉదయం,మధ్యాహ్నం ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు. ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఏసుప్రభు ప్రాణ త్యాగం తరువాత మూడోరోజున మరణాన్ని జయించి తిరిగి లేచిన మహత్తర ఘటన సందర్భంగా క్రైస్తవులు ఈస్టర్ పండుగను జరుపుకుంటారన్నారు. ఏసు మరణాన్ని జయించి తిరిగి రావటం ఆయనలో ఉన్న దైవశక్తికి నిదర్శనం అన్నారు. ఈస్టర్ పండుగ ప్రతీ క్రైస్తవుడి విశ్వాసాన్ని సమీక్షించుకోవడానికి, దేవునిపై అపారమైన ప్రేమను, క్షమాపణను ధ్యానించటానికి ఒక మంచి అవకాశం అని అన్నారు.

తిరుమలాయపాలెం:మండలంలోని వివిధ ప్రాంతాల్లో ఆదివారం ఈస్టర్ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రపంచమానవాళికోసం శుక్రవారం ఏసుక్రీస్తు సిలువ వేయబడి ప్రపంచ మానవాళికి పాపవిముక్తి కోసం పునరుత్థానం అయ్యాడని చెప్పారు. మాదిరిపురం,సుబ్లేడు, తిరుమలాయపాలెం, పిండిప్రోలు, మేడిదపల్లి తదితర గ్రామాల్లో చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వేకువజామునే ప్రార్థనలు చేశారు. ఈకార్యక్రమంలో చర్చిపాస్టర్లు జార్జి,మత్తయి, యోహాను, అమృతరెడ్డి, జీవరత్నం పాల్గొన్నారు

నాగేశ్వరరావు, కృష్ణకు కవిత పరామర్శ



పువ్వాడ నాగేశ్వరరావు, గుండాల కృష్ణను పరామర్శిస్తున్న కవిత

ఖమ్మం, ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): సీపీఐ సీనియర్‌నేత పువ్వాడ నాగేశ్వరరావు, ఆర్‌జేసీ విద్యాసంస్థల అధినేత గుండాల కృష్ణను ఆదివారం బీఆర్‌ఎస్ మహిళనేత, ఎమ్మెల్సీ కవిత పరామర్శించారు. ముందుగా ఇటీవల కాలుకు శస్త్రచికిత్స చేసుకున్న ఆర్‌జేసీ విద్యాసంస్థల అధినేత గుండాల కృష్ణ ఇంటికివెళ్లి పరామర్శించారు. ఆరోగ్య విషయాలు తెలుసుకున్నారు. గుండాల కృష్ణతోపాటు వారి వారి కుటుంబసభ్యులతో మాట్లాడారు.అనంతరం జిల్లా జాగృతి నాయకురాలు గట్టు అరుణకుమారి కుమారుడి వివాహ రిసెప్షన్‌కు హాజరయ్యారు. నూతన వధూవరులు సాయివివేక్, పావనిలను ఆశీర్వదించారు.సీపీఐసీనియర్‌నేత, ఉమ్మడి రాష్ట్రంలో సీపీఐ రాష్ట్రశాసనసభా పక్షమాజీ నేతపువ్వాడ నాగేశ్వరరావును పరామర్శించారు.మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కుటుంబసభ్యులు స్వాగతం పలికారు అనంతరం పువ్వాడ నాగేశ్వరరావుతో ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. పువ్వాడ కుటుంబసభ్యులతోను మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యేలు మదన్‌లాల్, హరిప్రియ, జిల్లా నాయకుడు బొమ్మరరామ్మూర్తి పాల్గొన్నారు.

వేతనాలు అందని గోపాలమిత్రలు

- ఏడు నెలలుగా ఇబ్బందులు
- ఆదుకోవాలంటూ వేడుకోలు...
- జిల్లావ్యాప్తంగా 250మంది వరకు సేవలు



నేలకొండపల్లి,ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో నిత్యం పశువుల పెంపకందారులకు అందుబాటులో ఉంటూ, పశువైద్య సిబ్బంది లేని చోటకు సైతం వెళుతూ సేవలందిస్తున్న గోపాలమిత్రులకు ఏడు నెలలుగా వేతనాలు అందటం లేదు. ఫలితంగా వారు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. జిల్లావ్యాప్తంగా దాదాపుగా 250మంది వరకు గోపాలమిత్రులు, మైత్రిలతో కలిసి రైతులకు రకరకాల సేవలందిస్తున్నారు. చాలా గ్రామాల్లో పశువైద్యులు లేక రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతుంటే మేమున్నామంటూగోపాలమిత్రులు ముందుకు వస్తున్నారు. ప్రతీ గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ 24గంటలు వైద్య సేవలందిస్తూ రైతులను ఆదుకుంటున్నారు. పశువులకు కృత్రిమ గర్భధారణ చేయించి, మేలుజాతి దూడలు ఎక్కువ సంఖ్యలో పెరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందును తాగిస్తూ గొర్రెల కాపరులకు సైతం అందుబాటులో ఉంటుంటారు. రైతులకుప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ సేవలందిస్తున్నారు. అటువంటి గోపాలమిత్రులకు నెలల తరబడి జీతాలు అందక పోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలే అరకొర జీతాలు...అవికూడా నెలల తరబడి చేతికి రాక పోవటంతో కుటుంబం గడవక ఇబ్బందులు పడుతున్నట్లు గోపాలమిత్రులు చెబుతున్నారు. పశువుల పెంపకందారులకు సేవలందిస్తున్న గోపాలమిత్రులు తమ సర్వీస్‌ను క్రమ బద్ధీకరణను చేయాలని డిమాండ్ చేస్తున్నారు. గోపాలమిత్రుల సేవలు అందుబాటులో లేకుంటే, అసలే పశువైద్యుల సేవలు అందుబాటులేని గ్రామాల్లో పశువుల పెంపకందారులు, గొర్రెలు,మేకల పెంపకందారుల ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇప్పటికైనా పెండింగ్‌లో ఉన్న జీతాలను అందించటానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

2న ఖమ్మం న్యాయవాద సంక్షేమ సంఘం ఎన్నికలు

- 23న నామినేషన్ల స్వీకరణ
- 12 మంది డైరెక్టర్లకు నాలుగు పదవులకు ఎన్నికలు

ఖమ్మంలీగల్, ఏప్రిల్20 (ఆంధ్రజ్యోతి): న్యాయవాద సంక్షేమసంఘం ఎన్నికలు మే 2న నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి గద్దేటి రమేష్ తెలిపారు. ఈనెల 23న ఉదయం 10:30నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు. 24మధ్యాహ్నం నుంచి సాయంత్రం 4గంటల వరకు పరిశీలన చేస్తారు. అనంతరం తుదిజాబితా విడుదల చేస్తారు. 25న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది.మే2న ఉదయం 10 గంటల నుంచి3గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. సాయంత్రం 4గంటల నుంచి ఓట్ల లెక్కింపు పూర్తిచేసి ఎన్నికల ఫలితాలు విడుదల చేయనున్నట్లు రమేష్ తెలిపారు. మొత్తం 12మంది డైరెక్టర్లకుగాను ఈ సంవత్సరం నాలుగు డైరెక్టర్ పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే ఆరుగురు అభ్యర్థులు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. తమ సహచరులతో మంతనాలు నిర్వహిస్తున్నారు. ఈసారి అధ్యక్ష పదవి దక్కించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. కొందరు డైరెక్టర్లని సహచరుల ద్వారా మద్దతు కూడకట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. కొందరికి వివిధ పదవులు ఇవ్వనున్నట్లుగా ఆశ చూపిస్తున్నారు. ఎన్నడూ లేని విధంగా మహిళా న్యాయవాదులు ఈసారి పోటీ పడుతుండటం విశేషం.

ఆర్థికసాయం అందజేత


ఆర్థికసహాయం అందజేస్తున్న మిత్రులు

పెనుబల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): తమతోపాటు చదువుకున్న మిత్రుడు అకాల మరణంతో కుటుంబం ఇబ్బందుల్లో ఉండటంతో స్నేహితులు ఆదివారం ఆర్థికసాయం అందించారు. వీఎంబంజర్ పాఠశాలలో 1996-97 పదోతరగతి చదువుకున్న మండలంలోని అగ్రహారం గ్రామానికి చెందిన గొల్లమందల వెంకటేశ్వరరావు(వెంకట్) కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఇటీవల మృతి చెందాడు. మిత్రుడు కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశ్యంతో స్నేహితులు వెంకటేశ్వరరావు కుమారుడు పవన్‌కల్యాణ్, కుమార్తె స్వాతిలకు తమవంతు సాయంగా రూ.36,700తోపాటు 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో మిత్రులు పలగాని ఈశ్వర్, కోట శ్రీనివాసరావు, షేక్.బాజీ, వెంకటాచారి, వెంకటేష్‌పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబానికి...


ఏన్కూరులో...

ఏన్కూరు, ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): ఆపదల్లో ఉన్న కార్మికుడికి తోటి కార్మికులు అండగా నిలిచారు. మండలంలోని బురదరాఘవాపురం గ్రామానికి చెందిన సుతారి మేస్త్రీ షేక్‌జాని అనారోగ్యానికి గురయ్యాడు. తోటి భవన నిర్మాణ కార్మికులు ఆదివారం అతని కుటుంబానికి క్వింటా బియ్యం, రూ.4వేల నగదు అందించారు. ఈకార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కార్యదర్శి బుచ్చల వెంకటేవ్వర్లు, మాడుగుల కృష్ణ, భద్రం, గాజుల నరేష్, శేఖర్, నాగరాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నెరవేరనున్న సిరిపురం సొసైటీ ఏర్పాటు కల

» హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

మధిరటౌన్, ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): మధిర లోని రైతు సేవా సహకార సంఘం జిల్లాలో అతి పెద్ద సొసైటీలలో ఒకటిగా నేటి వరకు ఉంది. కానీ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నూతన రైతు సహకార సంఘాల ఏర్పాటుకు సానుకూలత వ్యక్తం చేయడంతో సుదీర్ఘకాలం తమకు ప్రత్యేక సొసైటీ ఏర్పాటు చేయాలని కోరుతున్న సిరిపురం పరిసర గ్రామాల రైతుల ఆశలు మరికొన్ని రోజుల్లో నెరవేరే పరిస్థితులు కనిపిస్తున్నాయి. రైతులు తమ పంట రుణాల రెన్యువల్‌కు ఎరువులు కోసం ప్రతిసారి మధిరకు రావలసి వస్తుండటంతో సిరిపురం సొసైటీ ఏర్పాటు చేయాలని అనేక సందర్భాలలో ప్రజా ప్రతినిధులను కోరడమే కాకుండా స్థానిక శాసనసభ్యుడు మల్లు భట్టి విక్రమార్క ఉప ముఖ్యమంత్రి అయ్యాక ఆయనకు వినతి పత్రం ఇచ్చారు. ఆ సందర్భంలో భట్టి రైతుల కోరిక మేరకు తప్పకుండా సిరిపురం సొసైటీ ఏర్పాటు చేయిస్తానని వారికి హామీ ఇచ్చారు. ప్రస్తుతం మధిర సొసైటీ 18 గ్రామాలకు చెందిన రైతులతో జిల్లా లోనే అతిపెద్ద సొసైటీలలో ఒకటిగా ఉంది. మధిర మండలంలో 27 గ్రామ పంచాయతీలు ఉంటే మధిర మునిసిపాలిటీతో పాటు మునిసిపాలిటీ పరిధిలోని మడుపల్లి, జిలుగుమాడు గ్రామాలతో పాటు మరో 15 గ్రామ పంచాయతీలు మధిర సొసైటీ పరిధిలోనే ఉన్నాయి.

ప్రత్యేక సొసైటీ దిశగా సిరిపురం.....

మధిర సొసైటీ ప్రస్తుతం 18 గ్రామాలకు చెందిన 2,669 మంది రైతులతో అతి పెద్ద సొసైటీగా ఉండగా, మధిర సొసైటీ నుంచి సిరిపురం పరిసర గ్రామాలైన సిరిపురంతో పాటు మల్లారం, రొంపిమళ్ల, జాలిముడి, రామచంద్రాపురం, వెంకటాపురం, వంగవీడు తో పాటు యండపల్లి రెవెన్యూ గ్రామాన్ని కలిపి మొత్తం 1066 మంది రైతులతో మధిర నుంచి విడగొట్టి సిరిపురం సొసైటీ ఏర్పాటుకు సహకార శాఖ అధికారులు ఇప్పటికే ప్రతిపాదనలు పంపినట్లు తెలుస్తుంది. ప్రభుత్వం కూడా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పెద్ద సొసైటీలను విడగొట్టటం తో పాటు నూతన సొసైటీల ఏర్పాటుకు సుముఖంగా ఉండటం ఈ దిశగా అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో సిరిపురం ప్రత్యేక ప్రాథమిక సహకార సంఘంగా ఏర్పాటు కానుండటంతో అనేక ఏళ్లుగా ఈ ప్రాంత రైతుల కోరిక మరి కొద్ది రోజుల్లో నెరవేరనుంది.


మధిరలోని సొసైటీ కార్యాలయం

అన్ని అర్హతలు ఉన్నాయి



● లక్ష్మారెడ్డి, సొసైటీ సభ్యుడు

సిరిపురం పరిసర గ్రామాల ప్రజలు ఎరువుల కోసం మధిర వరకు వెళ్లాలంటే సుదూర ప్రయాణం చేయాల్సి ఉంది, సిరిపురం సొసైటీ ఏర్పాటు చేస్తే రైతులకు ఎంతో ఉపయోగం ఉంటుంది, సిరిపురం సొసైటీగా ఏర్పాటుకు అన్ని అర్హతలు ఉన్నాయి.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

» ఎమ్మెల్సీ కవిత


లింగాలలో ప్రజలకు అభివాదం చేస్తున్న కవిత

కల్లూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యో తి): రైతులను ఆదుకోవడంలో ప్రభు త్వం ఘోరంగా వైఫల్యం చెందిందని జనజాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. మండలంలోని లింగాల గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్‌షోలో ఆమె ప్రసంగించారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉన్న సమయంలో జిల్లాలో వడగండ్ల వాన వస్తే పంట నష్టం కింద రూ.పదివేలు ఇచ్చి రైతులను ఆదుకోవడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక నిజాం నాయకుడిగా అవతారమెత్తారని విమర్శించారు. కాంగ్రెస్ అధినేతలు సోనియా, రాహుల్ గాంధీలపై ఈడీ కేసులు పెడితే రాష్ట్రంలో నిరసన కార్యక్రమాలు చేపట్టకుండా జపాన్ పర్యటనలో చక్కర్లు కొడుతున్నారని ఆరోపించారు. జిల్లాలో వానలతో పంట నష్టం జరిగితే ముగ్గురు మంత్రులుండి కూడా క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని పరిశీలించకుండా హెలీకాప్టర్లలో చక్కర్లు కొడుతున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణలో బీఆర్ఎస్ పవర్‌ను లింగాల గ్రామంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, బీఆర్ఎస్ నాయకుడు దేవరపల్లి పట్టాభి ఆధ్వర్యంలో చూపించారన్నారు. నష్టపోయిన రైతులకు రూ.20వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ రోడ్‌షోలో సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ప్రసంగిస్తూ కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టారు.

కల్లూరు మండలం లింగాల గ్రామంలో డీఏన్‌పీ అధినేతలు దేవరపల్లి నాగప్రసాద్, పట్టాభిల నివాస గృహంలో శుభకార్యక్రమానికి ఎమ్మెల్సీ కవిత హాజరైన సందర్భంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రజలు, అభిమానులు ఎదురేగి ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియనాయక్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పాలెపు రామారావు, కట్టా అజయ్‌కుమార్, దేవరపల్లి పట్టాభి, నాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

23న జమలాపురంలో భూ భారతి సదస్సు

ఎర్రుపాలెం ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): మండలంలోని జమలాపురం గ్రామంలో ఈనెల 23న జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగే భూభారతి, కొత్త ఆర్వోఆర్ చట్టంపై నిర్వహించే రైతుల అవగాహన సదస్సుకు రైతులు పెద్దఎత్తున తరలిరావాలని తహసీల్దార్ ఎం. ఉషాశారద శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో ఎర్రుపాలెం మండలంలో ఈనెల 23న జమలాపురం గ్రామంలో వాసిరెడ్డి ఫంక్షన్‌లో జరిగే రైతుల అవగాహన సదస్సును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భూమిహక్కుల భద్రతకు, ప్రజల ఏళ్లనాటి భూమి సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా ఈచట్టాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. రైతులు, గ్రామస్థులు హాజరుకావాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు

సత్తుపల్లి, ఏప్రిల్20 (ఆంధ్రజ్యోతి): ఏసుక్రీస్తు సిలువ వేయబడి తిరిగి లేచిన పునరుత్థాన దినాన్ని పురస్కరించుకుని ఆదివారం పట్టణంతో పాటు మండలంలోని గ్రామాలలో చర్చీల్లో ఈస్టర్ వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చీలను పూలతో అలంకరించి క్రైస్తవులు ప్రార్థనలు నిర్వహించారు. సేయింట్ జేమ్స్ చర్చీలో పరిశుద్ధ సమభక్తపు ఆరాధన అనంతరం ఏసు పునరుత్థానము-రక్షణానందపు మహోత్సవం అంశంపై పాస్టర్ రెవ.డీ.జార్జీ క్లెమెంట్ ఈస్టర్ సందేశాన్ని అందించారు.


తల్లాడలో ప్రార్థన చేస్తున్న పాస్టర్ పరంజ్యోతి


రేజర్లలోని బిలీవర్స్ ఈస్టన్ చర్చీలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులలు

తల్లాడ: మండలంలోని క్రైస్తవ ప్రార్థనామందిరాలు, చర్చీల్లో క్రీస్తు పునరుత్థాన మహోత్సవ ఈస్టర్ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. క్రీస్తురాజ్య సువార్త ప్రార్థనామందిరంలో పాస్టర్ పరంజ్యోతి ఆధ్వర్యంలో కేక్‌కట్‌చేసి స్వీట్లు పంపిణీచేశారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ రెడ్డెం వీరమోహన్‌రెడ్డి బీఆర్ఎస్ మండల కార్యదర్శి దుగ్గిదేవర వెంకటలాల్, జీవీఆర్, కాంగ్రెస్‌నాయకులు తుమ్మలపల్లి రమేష్ రాయల రాము పాల్గొన్నారు. నారాయణపురంలోని లూర్దుమాత చర్చీలో ఈస్టర్ వేడుకల్లో విచారణ గురువులు అజయ్ జోసఫ్, ప్రాన్సిస్, మరియన్న తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సభను విజయవంతం చేయండి

కారేపల్లి, ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈనెల27న జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని వైరా నియోజకవర్గం మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ ముత్యాల సత్యానారాయణ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ25వ అవిర్భావ వేడుకల సందర్భంగా తలపెట్టిన రజతోత్సవ సభకు కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. సమావేశంలో మాజీ సర్పంచ్‌లు కుమార్, మత్రు, అడప పుల్లారావు, బత్తుల శ్రీనివాస్‌రావు, శంకర్, జాపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఉచిత వైద్యశిబిరం

వైరా, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): బోడేపూడి కళానిలయం ఆధ్వర్యంలో ఆదివారం 118వ నెల వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ప్రతినెలా మూడో ఆదివారం బోడేపూడి కళానిలయం ఆధ్వర్యంలో ఈ వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఖమ్మానికి చెందిన ప్రముఖ వైద్యులు చీకటి భారవి, పిల్లలమర్రి సుబ్బారావు రోగులను పరీక్షించారు. అతర్వాత నెలకు సరిపడా మందులను కేవలం రూ.వందకు అందజేశారు. సంస్థ కార్యదర్శి బొంతు రాంబాబు, మాజీ ఎంపీపీ బొంతు సమత, నిర్వాహకులు యనమద్ది కృష్ణ, గుడిమెట్ల రజిత, మోహన్‌రావు, మాదినేని రజిని, కంభంపాటి సత్యనారాయణ, పాసంగులపాటి చలపతిరావు, అయిలూరి శ్రీనివాసరెడ్డి, అనుమోలు రామారావు, మల్లెంపాటి ప్రసాద్, హరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


రోగులకు మందులు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

ఉపాధ్యాయుల ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు

బోనకల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిరునోముల ప్రాథమిక పాఠశాలలో వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి కొత్త అడ్మిషన్ల కోసం ముందుగానే ఉపాధ్యాయులు చింతల రవి కుమార్, కొనకంచి రామ్మోహన్‌లు బడిబాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆదివారం ప్రైవేటు పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారు ప్రభుత్వ బడుల్లో అమలవుతున్న కార్యక్రమాలను వివరించారు. తమ బడిలో పిల్లలను చేర్పించాలని, ఆంగ్ల మాధ్యమంలో నాణ్యమైన విద్యను అందిస్తామని భరోసా ఇచ్చారు. ముందుగానే అడ్మిషన్ల కోసం ప్రైవేటుకు పోటీగా ప్రభుత్వ ఉపాధ్యాయులు గ్రామంలో ప్రచారం నిర్వహించడాన్ని పలువురు అభినందిస్తున్నారు.

వక్ఫ్ బోర్డు చట్ట సవరణను ఉపసంహరించుకోవాలి

» సీపీఎం డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు

బోనకల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు చట్ట సవరణను కేంద్ర ప్రభుత్వం వెం టనే ఉపసంహరించుకోవాలని సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు డిమాండ్ చేశారు. వక్ఫ్ బోర్డు చట్ట సవరణకు వ్యతిరేకంగా బోనకల్‌లో ఆదివారం సీపీఎం, ముస్లిం సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు చింతలచెర్వు కోటేశ్వరరావు, దొండపాటి నాగేశ్వరరావు, కిలారు సురేష్, జొన్నలగడ్డ సునిత, పిల్లలమర్రి అప్పారావు, తెల్లాకుల శ్రీనివాసరావు, బోయినపల్లి వీరబాబు, ఉప్పర శ్రీను, కందికొండ శ్రీనివాసరావు, ముస్లిం సంఘ నాయకులు బుజ్జి మేస్త్రీ, మౌలాలి, సిలార్ పాల్గొన్నారు.


తల్లాడలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


బోనకల్‌లో నిరసన చేపడుతున్న సీపీఎం నాయకులు

తల్లాడలో...

తల్లాడ: దేశంలో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్ సవరణ చట్టాన్ని తక్షణమే ఎత్తివేయాలని బీఆర్ఎస్, కాంగ్రెస్, సీపీఎంపార్టీల నాయకులు డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ వివిధ రాజకీయపార్టీల ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు, జెండాలతో ఆదివారం తల్లాడలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ముస్లిం మైనారిటీ విభాగం నాయకుడు షేక్ మస్తాన్ అధ్యక్షతన జరిగిన సభలో మాజీ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, దుగ్గిదేవర వెంకటలాల్, కాంగ్రెస్ నాయకులు రాయల రాము, తుమ్మలపల్లి రమేష్, సీపీఎం నాయకులు శీలం సత్యనారాయణరెడ్డి, అయినాల రామలింగేశ్వరరావులు పాల్గొన్నారు.

సుబాబుల్ పంట దగ్ధం

బోనకల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆళ్లపాడు, రాయనపేట గ్రామాల్లో సుబాబుల్, మక్క పంటలు ఆదివారం అగ్గికి కాలి బూడిదయ్యాయి. ఆళ్లపాడుకు చెందిన మలాది అచ్చయ్య నారాయణపురం మైనర్ కాలువ పరిధిలో రెండు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని మక్క పంటను సాగు చేశాడు. పంట బాగా పండటంతో 80 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని సంతోషపడ్డాడు. ఇటీవల వచ్చిన గాలి దుమారానికి పంట నేల మట్టమైంది. మిషన్ పట్టే అవకాశం లేకపోవడంతో పాటు కూలీల కొరత వలన పంట చేలోనే ఉంది. కాగా గుర్తు తెలియని వ్యక్తులు చెత్తకు నిప్పంటించడంతో మంటలు మక్క పైరుకు వ్యాపించాయి. రెండు ఎకరాల్లో పంట అంత కాలి బూడిదైంది.

మంటలు పొలాలకు వ్యాపించడంతో దగ్గరలో ఉన్న బొమ్మినేని హన్మంతరావుకు చెందిన 3 ఎకరాల్లోని సుబాబుల్ దగ్ధమైంది. అగ్ని వలన దాదాపు రూ.6 లక్షలకు పైగా పంట నష్టం జరిగిందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఫైరింజన్ వచ్చే లోపు పంటలన్నీ దగ్ధమయ్యాయి.

కబడ్డీ పోటీలు

ఏన్కూరు, ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): ఏన్కూరు మండలం గంగులనాచారంలో ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాల స్థాయి కబడ్డీ పోటీలను ఈనెల 25,26,27 తేదీలలో నిర్వహిస్తున్నట్టు ఆహ్వాన కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. మొదటి బహుమతి రూ.25వేలు, ద్వితీయ బహుమతి రూ.20వేలు అని నిర్వాహకులు తెలిపారు. వరప్రసాద్ 91003 71761, మల్కం సురేష్ 9573549112 సెల్ నెంబర్లకు ఈనెల 24 తేదీలోపు సంప్రదించాలని కోరారు.

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

వైరా, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ అ ధ్యక్షుడు, ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 75వ జన్మదిన వేడుకలను ఆదివారం వైరా మండలంలో ఘనంగా నిర్వహించారు. వైరా టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెరుకూరి చలపతి రావు, మండల, పట్టణ అధ్యక్షులు కిలారు సురేందర్, మన్నేపల్లి ప్రదీప్ కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. మండడపు మధుసూదన్‌రావు, మోత్కూరి వెంకటేశ్వరరావు, కోడె త్రాసు, మండడపు వాసు, మద్దినేని రామారావు, సూర్యదేవర వెంకటకృష్ణ, బొల్లేపల్లి శ్రీను పాల్గొన్నారు. అలాగే తాటిపూడిలో శనివారం అర్ధరాత్రి 12గంటలకు బండి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో టీడీపీ అభిమానులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. శేషాచలం రాంబాబు, నాగరాజు, వీరభద్రం పాల్గొన్నారు.

బోనకల్: బోనకల్ టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు రావుట్ల సత్యనారాయణ మాట్లాడుతూ గొప్ప విజన్ ఉన్న నేతగా చంద్రబాబు నాయుడు ప్రపంచంలోనే గుర్తింపు పొందారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో నందమూరి సత్యనారాయణ, మైనేని రవి కుమార్, మరీదు బరకయ్య, గంగుల శ్రీనివాసరావు, తూము పురుషోత్తం, ఏసుపోగు నాగేశ్వరరావు, గోర్కే, బందం రంగయ్య, మామిళ్ల నర్సింహారావు, యనమద్ది యాదయ్య, మంగయ్య, బండి రామారావు పాల్గొన్నారు.

కల్లూరు: కల్లూరులో ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మెయిన్ సెంటర్లో టీడీపీ నాయకులు జాస్తీ శ్రీనివాసరావు, పోట్రు శ్రీనివాసరావులు కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం బాటసారులకు వేసవిని దృష్టిలో ఉంచుకొని మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కట్టా గోపాలరావు, మీసాల కృష్ణ, అభిమానులు మద్దినేని రాధాకృష్ణ, మండేపూడి వెంకటయ్య పాల్గొన్నారు.

ఏన్కూరు: టీడీపీ అధినేత ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను ఆదివారం ఏన్కూరు మండల టీడీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆరెంవరలక్ష్మి, మాజీజడ్పీటీసీ కొపెల శ్యామల, మండలపార్టీ అధ్యక్షుడు కొనకంచి రామకృష్ణ, తోట రాధాకృష్ణ, ఎల్లంపల్లి వేణు, ఆరెం రామయ్య,కొపెల రామారావు, మాజీఉపసర్పచ్ వేముల రమేష్‌బాబు, మాదినేని అశోక్ పాల్గొన్నారు.

మధిరరూరల్: ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు మధిరలో ఘనంగా నిర్వహించారు. టీడీపీ కార్యాలయంలో కేక్‌ను ఖమ్మం టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు వాసిరెడ్డి రామనాథం కట్‌చేశారు. అలాగే ఆర్‌కే ఫౌండేషన్ ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. ఈకార్యక్రమంలో మల్లాది హనుమంతరావు, చేకూరు శేఖర్‌బాబు, వేమూరు సునిల్‌కుమార్, చెరుకూరి కృష్ణారావు,మర్నీడి పుల్లారావు, వేల్పుల కొండ, రాణి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తల్లాడ: ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుఉకలను ఆదివారం తల్లాడలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేక్‌ను కట్‌చేసి స్వీట్లు పంపిణీచేశారు. ఈకార్యక్రమలో టీడీపీ మండల అధ్యక్షుడు కూచిపుడి వెంకటేశ్వర్లు, సరికొండ శ్రీనివాసరాజు, మొక్క కృష్ణార్జునరావు, సురేష్, నారపోగు ప్రసాద్ పాల్గొన్నారు.


బోనకల్‌లో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు


మధిరరూరల్‌లో...


కల్లూరులో...


వైరాలో...

చిన్నప్రాణులకు.. పెద్దసాయం

ఎర్రుపాలెం, ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): వేసవిలో వాతావరణంలో ఉష్ణోగ్రతలు పెరగడంతో చెట్లు, నీటివనరుల ఎండిపోతాయి. నీటి లభ్యత తక్కువగా ఉంటుంది. వేసవికి పక్షులు నీరు దొరక్క అల్లాడిపోతుంటాయి. చిన్న ప్రాణులకు పెద్దసాయం పేరుతో ఎర్రుపాలెం ఏబీఎన్ ఆంధ్రజ్యోతి వినూత్న సేవా కార్యక్రమానికి ఆదివారం శ్రీకారం చుట్టింది. ఈసందర్భంగా ఎర్రుపాలెం తహసీల్దార్ కార్యాలయం వద్ద గల చెట్టుకు వాటర్‌బాక్సును ఏర్పాటుచేసి పక్షులకు నీరు అందించే కార్యక్రమం ప్రారంభించింది.



పక్షుల కోసం ఏర్పాటు చేసిన వాటర్‌బాక్స్

కాస్త పట్టించుకోరూ...


ధ్వంసమైన రింగ్‌సెంటర్‌లోని డివైడర్

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సత్తుపల్లి తర్వాత ప్రాముఖ్యత కలిగిన గ్రామం గంగారం. ఆ గ్రామం తరచూ ప్రమాదాలకు నిలయంగా మారుతుంది. జాతీయ రహదారిపై ఉన్న ఈ గ్రామంలో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటాయి. ముఖ్యంగా రింగ్‌సెంటర్‌లోని డివైడర్‌ను అశాస్త్రీయంగా నిర్మించడంతో వారంలో రెండు మూడు ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాలు ఢీకొనడంతో డివైడర్ పూర్తిగా ధ్వంసమవ్వడం, ట్రాఫిక్ సమస్య ఏర్పడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతం నుంచి ఖమ్మం, రాజమండ్రి, చింతలపూడి, ఏలూరు, విజయవాడ, భద్రాచలం పట్టణాలకు వాహనాలు నిత్యం వేలాదిగా రాకపోకలు సాగిస్తుంటాయని, శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.